నవతెలంగాణ 1
సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట
సోమవారం 06 మార్చి 2023



మల్లన్న వనంలో రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి



నవతెలంగాణ కొండపాక

మల్లన్న వనంలోని రోడ్డు పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. లకుడారం శివారులోని రాజీవ్ రహదారి పక్కన గల మల్లన్న వనాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లన్న సాగర్ వ్యూ పాయింట్ వరకు నూతనంగా వేస్తున్న మట్టి రోడ్డు నుంచి నడిచి పనులను పర్యవేక్షించారు. వ్యూ పాయింట్ వద్ద వాచ్ టవర్ ను ఏర్పాటు చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాసరావును ఆదేశించారు. ఈ పర్యటనలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కిరణ్ కుమార్, ఫారెస్ట్ సెక్షన్ బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో అదుపు తప్పిన ఆహార అలవాట్లు, పరిశుభ్రత, పారిశుధ్యం, వాతావరణ మార్పులు తదితరాలవల్ల లెక్కకుమించి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరు వ్యక్తిగత ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ గ్రామంలో గల శ్రీపూరి జగన్నాథ్ దేవాలయ ఆవరణలో దేవాలయ కమిటీ మరియు తెలంగాణ, ఒడిస్సా డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా, వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, బూరిగారి వెంకటరెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు పటాన్‌చెరుకు మంత్రి హరీశ్‌రావు రాక

నవతెలంగాణ-పటాన్‌చెరు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నేడు పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి మహిళా దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరు కాబోతున్నట్టు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రితో పాటు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత లక్ష్మారెడ్డి, సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజు శ్రీ జయపాల్ రెడ్డి, మెదక్ పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శరత్‌కుమార్, శాసనమండలి మాజీ చైర్మెన్ భూపాల్ రెడ్డి, డిఐజి సుమతి, అదనపు ఎస్పీ శ్రీమతి ఉషా విశ్వనాథ్ తో పాటు నియోజకవర్గ మహిళా ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో అవగాహన సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులను పంపిణీ చేస్తారన్నారు. నియోజకవర్గ పరిధిలోని మహిళా ప్రజాప్రతినిధులు,ఉద్యోగినులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



ఏఐటీయూసీ మండల కమిటీ అధ్యక్షుడిగా ప్రభాకర్

నవతెలంగాణ-సదాశివపేట

ఏఐటీయూసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సదాశివపేట మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నీరుడు సాయిలు, కార్యదర్శి బోయిన్ ప్రసాద్ ఆధ్వర్యంలో మండల కమిటీ అధ్యక్షుడిగా ప్రభాకర్‌ను, కార్యదర్శిగా శంకరప్ప, ఉపాధ్యక్షుడుగా జాని మియా, సహాయ కార్యదర్శిగా రఘునాథ్, కోశాధికారిగా ముస్తఫా, కమిటీ సభ్యులుగా దత్తు స్వామి, ఆర్. లక్ష్మి, బుజ్జవ్వ, నర్సమ్మ, రాములును ఏన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం, సదాశివపేట మండలంలోని కంపెనీలలో కార్మిక చట్టాలు అమలయ్యేల ఏఐయుటిసి ప్రత్యేక పోరాటాలకు సిద్ధంగా ఉంటుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తాజొద్దిన్, షఫీ అహ్మద్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి బోయిని లక్ష్మి, మాధవి తదితరులున్నారు.

ఆకలి, వడదెబ్బ తట్టుకోలేక యాచకుడు మృతి



నవతెలంగాణ-కంది

ఆకలికి, వడదెబ్బకు తట్టుకోలేక సంగారెడ్డి రూరల్ పరిధిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం రెండో గేటు వద్ద ఓ యాచకుడు మృతి చెందాడు.మృతని వయస్సు 55-60 ఏండ్ల మధ్య ఉంటుందని.. అతని ఒంటిపైన బట్టలు కూడా లేవు అని పోలీసులు తెలిపారు. మృత దేహన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరచినట్టు రూరల్ ఎస్ఐ చెప్పారు. ఆ వ్యక్తి ఆచూకి తెలిసిన వారు ఎస్ఐ సంగారెడ్డి రూరల్ 8712656746, సిఐ సంగారెడ్డి రూరల్ సర్కిల్ 8712656719కు నెంబర్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.



సంజీవనరావుపేట్‌లో నూతన మసీదు ప్రారంభం

నవతెలంగాణ-నారాయణఖేడ్

మండలంలోని సంజీవనరావుపేట్‌లో నూతనంగా నిర్మించిన మసీదును భక్తి శ్రద్ధలతో, కుల, మతాలకు అతీతంగా గ్రామ ప్రజలంతా కలిసి ఎంతో ఘనంగా సర్పంచ్ విఠల్, ఎంపీటీసీ భూపాల్ చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ రామ్ రెడ్డి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. అనంతరం మసీదు నిర్మాణ దాత సాదిక్‌ను మత పెద్దలు సన్మానించారు. తదనంతరం మత గురువులు ధార్మిక సందేశం ఇచ్చారు. మసీదు కోసం ఏళ్లవేళలా సేవలు అందించిన వారిని కార్యక్రమ ముగింపులో ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు షాదుల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సాజిద్, హైమద్, గౌస్, మైనొదిన్, బాబుమియ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్‌కు జెడ్పీటీసీ పరామర్శ

నవతెలంగాణ-కల్హేర్

నిజాంపేట్ మండలంలోని నాగధర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటేశం సెట్ లివర్ వ్యాధితో బాధపడుతూ సికింద్రాబాద్ యశోద హస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసి కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి ఆదివారం ఆసుపత్రికి వెళ్లి వెంకటేశంను పరామర్శించి.. మనోధైర్యాన్ని అందించారు.




చింతా ప్రభాకర్ తొందరగా కోలుకోవాలని పూజలు

నవతెలంగాణ-సదాశివపేట

రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మెన్ చింతా ప్రభాకర్ ఆరోగ్యం మెరుగుపడాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఏడుపాయల వనదుర్గ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, యువత ప్రధాన కార్యదర్శి ఎం.కుమార్‌లు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి సాధకుడు సదాశివపేట ముద్దుబిడ్డ చింతా ప్రభాకర్ అన్న ఆరోగ్యం పూర్తిగా కోలుకుని.. ప్రజల మధ్యల తిరుగుతూ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు ఎల్లవేళలా అండాలని అమ్మవారిని వేడుకుంటున్నామన్నారు. సునీల్, దుర్గా, సతీష్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ కాంగ్రెస్‌లో లుకలుకలు



- అధికార పార్టీ వైపు మెజారిటీ చూపు
- మంత్రి హరీశ్‌రావుతో పలు దఫాలుగా చర్చలు జరిగినట్టు గుసగుసలు

జహీరాబాద్ కాంగ్రెస్‌లో ముసలం నెలకొంది. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు ఇప్పటికే రెండు వర్గాలుగా విడిపోయి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం విధితమే. అయితే ఈ వర్గపోరు మరింత ముదిరినట్టు గుసగుసలు వినబడుతున్నాయి. దీంతో పలువురు ముఖ్య నాయకులు ఇప్పటికే మంత్రి హరీశ్‌రావుతో పలు దఫాలుగా చర్చలు కూడా జరిపారని.. త్వరలోనే బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకుంటారని స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో నియోజకవర్గంలోని పలు మండలాల్లో మంత్రి నేడు చేపట్టనున్న పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

నవతెలంగాణ-జహీరాబాద్

పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపులో సైతం మాజీ మంత్రి గీతారెడ్డి అనుచరులు, టీపీసీసీ నాయకులు వై.నరోత్తం అనుచరులు వేరువేరుగా కార్యక్రమాలు నిర్వహించడంతో నియోజకవర్గంలోని కార్యకర్తలు అయోమయంలో పడి పలు దఫాలుగా నాయకులను నిలదీసిన ఘటనలు కూడా ఉన్నాయి. దీంతో గత కొన్ని రోజులుగా పార్టీ కార్యక్రమాలకు అంటిముట్టనట్లు వ్యవహరిస్తున్న నియోజకవర్గంలోని కోహిర్, ఝరాసంగం, న్యాలకల్ మండలాలకు చెందిన పలువురు నాయకులు మంత్రి హరీశ్‌రావుతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయా మండలాల్లోని నాయకులతో ఇప్పటికే మంత్రి రహస్య చర్చలు జరిపి వారి నివేదికలను సైతం స్వీకరించి వాటిని అమలుపరిచేందుకు ప్రణాళికను కూడా చేసినట్టు సమాచారం. ఝరాసంఘం మండలంలోని ప్రముఖ నాయకుడు తాను పార్టీ మారుతున్నట్టు కిందిస్థాయి కార్యకర్తలకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్టు తెలియడం కూడా అందుకు బలాన్ని చేకూరుస్తున్నది. దీంతో ఆయన పిలుపుకు మెజారిటీ ప్రజాప్రతినిధులు అంగీకరించడంతో త్వరలోనే అధికార పార్టీలో చేరుతున్నారన్నట్టు చర్చ జరుగుతోంది.

గతంలో మాజీ మంత్రి కీర్తిశేషులు ఫరీదోద్దీన్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించడంతో నాడు కేసీఆర్ పిలుపుమేరకు ఆయన తన అనుచర గణంతో టీఆర్ఎస్‌లో చేరారు. తదుపరి ఎన్నికల్లో మున్సిపల్‌తో పాటు జహీరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచి.. జహీరాబాద్‌లో చరిత్ర సృష్టించారు. అయితే తదుపరి జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఝరాసంఘం, కోహిర్ ,జహీరాబాద్ మండలాల్లో కాంగ్రెస్ పార్టీ తిరిగి బలాన్ని పెంచుకొని మూడు మండలాలతో పాటు జెడ్పీటీసీ స్థానాలను కూడా గెలుపొందింది. అయితే ప్రస్తుతం స్థానికంగా జరిగిన రాజకీయ పరిణామాలు, అధికార పార్టీ ప్రవేశపెట్టిన పథకాలు అన్ని వర్గాల దరికి చేరడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమైన మెజారిటీ నాయకులు టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. మాజీ మంత్రి గీతారెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉంటూ అడపాదడపా జహీరాబాద్‌కు వచ్చి వెళ్లడంతో తమ బాగోగులు చూసేది ఎవరని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీపీసీసీ నాయకులు నరోత్తం జహీరాబాద్‌లో స్థానికంగా ఉంటూ.. కార్యకర్తలకు సమయం ఇవ్వడంతో పాటు వారికి సంబంధించిన శుభకార్యాలకు హాజరై మనోధైర్యం పెంచేందుకు కృషి చేస్తున్నారు. అయితే పార్టీ అధిష్టానం నుంచి ఆయనకు తగిన స్థాయిలో గుర్తింపు లభించకపోవడంతో అనుకున్న స్థాయిలో సేవ చేయలేకపోతున్నారనీ పార్టీ నాయకులు గుసగుసలాడుకుంటున్నారు. ఈ విషయాలు తెలిసి ట్రబుల్ షూటర్ అయిన మంత్రి హరీశ్‌రావు జహీరాబాద్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారని సమాచారం. సొంత పార్టీ కార్యకర్తలతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటూ.. ఇతర పార్టీ నాయకులపై కూడా దృష్టిం సారించారని.. అందుకే చాలామంది నాయకులు గులాబీ కండువా కప్పుడుకోవడానికి సిద్ధం అవుతున్నట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా అవతరించిన అనంతరం కర్నాటక, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న జహీరాబాద్ నియోజకవర్గంపై బీఆర్ఎస్ అధిష్టానం ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఈ నియోజకవర్గంలో చేపడుతున్న అభి వృద్ధి కార్యక్రమాలకు సరిహద్దులో ఉన్న కర్నాటక, మహారాష్ట్రకు చెందిన నాయకులను తీసుకువచ్చి చూపించడంతోపాటు.. రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను కూడా వారికి తెలియజేస్తున్నది. ఈ క్రమంలో నేడు(సోమవారం) నియోజ కవర్గంలో మంత్రి హరీశ్‌రావు పర్యటన ప్రత్యేక అందరిలో ఆసక్తిని పెంచుతున్నది. మంత్రి పర్యటన అనంతరం బీఆర్ఎ స్‌లో చేరికలు ఉంటాయని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు.

యాసంగి వడ్లను బీజేపీ ప్రభుత్వం కొన్నా.. కొనకపోయినా
కేసీఆర్ ప్రభుత్వం కొంటది

- రైతులు ఆందోళన చెందొద్దు
- ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు
- రావురుకుల నూతన గ్రామపంచాయతీ ప్రారంభం
- ఇంద్రగూడెం నుంచి అప్పనపల్లి వరకు రూ.333 లక్షల వ్యయంతో బి.టి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన
- పాల్గొన్న జెడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ, ఎమ్మెల్యే రసమయి



నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

ఈ యాసంగిలో కేంద్ర బీజేపీ వడ్లు కొన్నా కొనకపోయినా.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వడ్లు కొంటుందని రైతులు ఆందోళన చెందొద్దని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటరూరల్ మండల పరిధిలోని రావురూకుల నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని జెడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తో కలిసి మంత్రి ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఇంద్రగూడెం నుంచి దుబ్బాక నియోజకవర్గం అప్పన్నపల్లి గ్రామం వరకూ రూ.333 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీ.టీ రోడ్డు పనులకు శంకుస్థాపన మరియు గ్రామ ఫంక్షన్ హాల్ ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ యాసంగిలో వడ్లు కొనమని, తెలంగాణ వాసులను నూకలు బుక్కమని ఇక్కడి ప్రజల్ని అవహేళన చేసిందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం కొన్నా.. కొనకపోయినా.. రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా యాసంగి వడ్లను కొంటుందని స్పష్టం చేశారు. కులం, మతం పేరిట ఓట్లు పొందడమే బీజేపీ ధ్యేయమన్నారు. డీజిల్, సిలిండర్ ధరలను విపరీ తంగా పెంచి సామాన్యులపై మోయలేని భారం వేసిందనా న్నారు. ఉద్యోగాలు కల్పించాల్సింది పోయి ఉన్న ఉద్యోగాలనే ఊడగొడుతున్నదని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మకాలకు పెట్టడం తప్ప బీజేపీ ప్రజలకు చేస్తున్న సేవ ఏమీ లేదన్నారు.

రావురూకుల గ్రామం మీదుగా రూ.160 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రింగురోడ్డు దరిమిలా వస్తున్నదన్నారు. ఈ రింగు రోడ్డు గ్రామం నుంచి వెళ్లేలా గ్రామస్తులంతా పెద్ద మనస్సుతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మీ నిర్ణయమే.. మా నిర్ణయమని రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయే వారికి రూ.3 లక్షలు గ్రాంట్ రూపేణా అందిస్తామన్నారు. గ్రామానికి ఫంక్షన్ హాల్ కావాలని గ్రామస్తుడైన ఎమ్మెల్యే రసమయి కోరిన వెంటనే ఫంక్షన్ హాల్ నిర్మించి ఇవాళ అందుబాటులో తెచ్చుకున్నామన్నారు. రూ.1.15 కోట్లతో గ్రామానికి అభివృద్ధి చేశామని, గ్రామానికి అవసరమైన మరిన్ని 50 స్పింక్లర్లు పంపిణీ చేస్తామన్నారు. అలాగే మీ కష్టానికి తగిన ప్రతి ఫలం దక్కాలంటే పామాయిల్ తోటలు విరివిగా నాటాలని రైతు లను కోరారు. అనంతరం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి బాగా జరిగిందన్నారు. ఇవాళ ప్రారంభం చేసుకున్న విలేజ్ ఫంక్షన్ హాల్‌కు బదులుగా హరీశన్న ఫంక్షన్ హాల్ అని పేరు మార్చి వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి, జెడ్పిటిసి శ్రీహరి గౌడ్, ఎంపీపీ శ్రీదేవి చంద్రరావు, వైస్ ఎంపీపీ యాదయ్య, సర్పంచ్ నీరటి కవిత రవీందర్, ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి వార్డు సభ్యులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఊరు అంటే బుస్సాపూర్ లాగా ఉండాలి..



ఊరు అంటే బుస్సాపూర్ లాగా ఉండాలని మంత్రి హరీశ్‌రావు కితాబిచ్చారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామంలోఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభం, రెడ్డి సంక్షేమ భవనానికి శంకుస్థాపన, మహిళా భవనం, లైబ్రరీ, రూ.16 లక్షల వ్యయంతో 10 మెట్రిక్ టన్నుల స్టోరేజీ కలిగిన కోల్డ్ స్టోరేజీలను జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎత్తుపై ఉన్న బుస్సాపూర్ గ్రామానికి రాష్ట్రంలోనే మొదటిసారిగా ఇరిగేషన్ పైపులైన్ల ద్వారా రైతుల పొలం.. వాకిట్లోకి త్వరలోనే సాగునీళ్లు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో మీ ఇంటి పొయ్యికాడికే మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీళ్లు అందిస్తున్నామన్నారు. ఈనెల 8వ తేదీన మహిళా దినోత్సవం సందర్భంగా రెండేండ్లుగా పెండింగులో ఉన్న వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తూ మీ బ్యాంకుల్లో జమ చేస్తామని మహిళా సంఘాలకు చెప్పారు. అదేవిధంగా కేసీఆర్ కిట్టుతో పాటు న్యూట్రిషన్ కిట్టు కూడా అందజేస్తామన్నారు. అనవసరంగా ఆపరేషన్లు చేయించొద్దని.. ఆపరేషన్ల వల్ల ఆరోగ్యం క్షీణిస్తోందని మహిళలకు అవగాహన కల్పించారు. సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి, జెడి ్పటిసి శ్రీహరి గౌడు, ఎంపీపీ శ్రీదేవి చంద్రరావు, వైస్ఎంపీపీ యాదయ్య, సర్పంచ్ సదాశివారెడ్డి, ఎంపిటిసి ఎల్లం తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ వరి పంట.. నాలుగు రాష్ట్రాలకు అన్నం పెడుతోంది

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

తెలంగాణ రాష్ట్రంలో పండిన వరి ధాన్యం నాలుగు రాష్ట్రాలకు అన్నం పెడుతున్నదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చిన్నగుండవెల్లి గ్రామంలో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మతో కలిసి రైతువేదిక, యోగ కేంద్రంను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 54 లక్షల వరి సాగు చేస్తే, ఆంధ్రప్రదేశ్ లో 16 లక్షల సాగు చేశారు అన్నారు, సీఎం కేసీఆర్ కృషితో కాలేశ్వరం నీళ్లతో సాధ్యమైందన్నారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ ఆలోచనలతో అనేక సంక్షేమ పథకాలతో గొప్ప మార్పు వచ్చి అబివృద్ధిలో ముందుకు సాగుతున్నామని చెప్పుకొచ్చారు. ఆయిల్ ఫామ్ లాభదాయకమైన పంటగా వివరిస్తూ.. ఆయిల్ ఫామ్ సాగు కోసం బడ్జెట్‌లో వేయికోట్లు సబ్సిడీ కింద అందిస్తున్నామని, రైతులు ఆయిల్ ఫామ్ పంటలు సాగుచేసే దిశగా అడుగులు వేయాలని కోరారు. రైతులకు మేలు చేకూర్చాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, తెలంగాణలో రైతు రాజ్యం నడుస్తున్నదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ప్రతిపక్షాలకు ఏమని విమర్శించాలో.. అర్థం కాక, తెలియక సతమతమవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ మా రెడ్డి రవీందర్ రెడ్డి, జెడ్పిటిసి శ్రీహరి గౌడు, ఎంపీపీ శ్రీదేవి చందరావు, వైస్ ఎంపీపీ యాదయ్య, సర్పంచ్ రఘోంత్తం రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- వారి ప్రాణత్యాగంతోనే స్వరాష్ట్రం సాధ్యమైంది
- మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మిరుదొడ్డి మండలంలోని కొండాపూర్ గ్రామంలో తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమరుల త్యాగ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం కోసం అమరులు చేసిన త్యాగాలు మరువలేనివని కొనియాడారు. అమరుల ఆశాసాధనలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామంలో అమరులను స్మరిస్తూ స్థూపాన్ని గ్రామస్తులు కలిసికట్టుగా ఏర్పాటు చేసుకోవడం హర్షనీయమన్నారు. ప్రతి సంవత్సరం జూన్ రెండో తేదీన తెలంగాణ అమరవీరులను స్మరించుకోవడంతో పాటు అమరవీరుల కుటుంబాలకు రూ.10 లక్షలతో పాటు ఉద్యోగాన్ని కల్పించామని గుర్తు చేశారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలు చేపడుతున్నామన్నారు. దక్షిణ భారతదేశ దక్షిణ భారతదేశంలో తెలంగాణ దాన్యభాండకారంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలు గ్రహిస్తున్నారని రాబోయే రోజుల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం గ్రామంలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. జడ్పీ చైర్పర్సన్ రోజా శర్మ, ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, యాదవ రెడ్డి, పాపయ్య, తిరుపతిరెడ్డి, సర్పంచ్ కవిత రాజు, తుమ్మల బాలరాజు, మహేందర్ రెడ్డి, బాపురెడ్డి ప్రజా ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి



నవతెలంగాణ-జహీరాబాద్

మొగుడంపల్లి మండలంలోని మిట్టు నాయక్ తాండాకు చెందిన మంజు బాయ్(28) తన వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ వైరుకు తగిలి అనుమానాస్పదంగా మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ మాదిరిగానే ఆదివారం నాడు కూడా వ్యవసాయ పొలానికి నీళ్లు పెట్టేందుకు మంజు బాయ్ వెళ్లింది. అయితే కాసేపటికి పొలంలోనే విగతజీవిగా ఆమె కనిపించింది. అయితే మోటార్ స్టార్టర్ వద్ద వైరు తేలింది గ్రహించకపోవడంతో ప్రమాదవశత్తు విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందినట్టు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు సంతానం ఉన్నారు. కాగా ఆమె మృతికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిరాకుపల్లి ఎస్సై తెలిపారు.



ఆయమ్మ కుటుంబానికి సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

నవతెలంగాణ-నారాయణఖేడ్

ఖేడ్ ప్రాజెక్ట్ అంత్వర్ సెక్టార్లో పనిచేస్తున్న ఆయమ్మ మానెమ్మ మృతి చెందింది. కాగా ఆమె కుటుంబానికి సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు చిరంజీవి, యూనియన్ అధ్యక్షులు నాగేశ్వరి, ప్రధాన కార్యదర్శి వీణ కుమారి, మద్వార్ సుశీల, స్వరూప, అంజమ్మ, సుశీల, ప్రమీల గ్రామ సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో చెరువుల మత్తళ్లు



నవతెలంగాణ-దౌల్తాబాద్

సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో మండుటెండలోనూ చెరువులు, కుంటలు మత్తళ్లు దూకుతున్నాయని ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాచినపల్లి, తిరుమలాపూర్ గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. మాచినపల్లిలో ముదిరాజ్ భవన నిర్మాణానికి రూ.5 లక్షల రూపాయలు మంజూరు చేశారు. అదే మాదిరిగా తిరమలాపూర్‌లో గౌడ సంఘానికి భవన నిర్మాణం కోసం రూ.5 లక్షలు, ముదిరాజ్ భవనానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతు బాగుంటే రాజ్యం బాగుంటదని నినాదంతో.. ప్రతీ గ్రామానికి సాగు నీరే అందిచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. అందులో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రతీ గ్రామంలోని చెరువులను, కుంటలను నింపుతున్నదన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రణం శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ చైర్మెన్ వెంకట్ రెడ్డి, వైస్ ఎంపీపీ అల్లి శేఖర రెడ్డి, సర్పంచులు భాగ్య, సుగుణ, ఎంపీటీసీ దేవేందర్, ఎంపీటీసీలు మల్లేశం, తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, ఇప్ప దయాకర్, టీఆర్ఎస్వి నాయకులు ఖలియుద్దీన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ సంఘర్ష ర్యాలీని జయప్రదం చేద్దాం



నవతెలంగాణ-కొండపాక

ఏప్రిల్ 5న నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి అన్నారు. మండల పరిధిలో రవీంద్రచారి అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎనిమిదేండ్లుగా దేశంలో అమలు చేస్తున్న కార్పొరేట్- మతోన్మాద అనుకూల విధానాలను, రైతు, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు తక్షణమే విరమించుకోవాలన్నారు. కార్మిక హక్కులు, కార్మిక చట్టాల రక్షణ, 4లేబర్ కోడ్స్ రద్దు, విద్యుత్ సవరణ బిల్లు 2022 ఉపసంహరణ, గ్రామీణ ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచి కనీస వేతనం రూ. 600లుగా నిర్ణయించాలన్నారు. ధరల పెరుగుదలను నియంత్రించాలన్నారు. రైతు పండించే అన్ని ఉత్పత్తులకు కనీస మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు గ్యారెంటీ చేయాలని డిమాండ్ చేశారు. ఒకేసారి కేంద్ర ప్రభుత్వం రుణమాఫీ చేయాలన్నారు. 55 ఏళ్లు పైబడిన వారందరికీ పెన్షన్ అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరింప చేయాలని డిమాండ్ చేశారు. దేశ రైతాంగం ఏడాదికి పైగా చేసిన పోరాట దాటికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం 3వ్యవ సాయ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి సంవత్సరం దాటింది. అయినా దొడ్డిదారిన అవే విధానాలను ఏకపక్షంగా అమలు చేస్తుందన్నారు. ప్రపంచ దేశాల ముందు భారతదేశ ప్రతిష్టను మంట కలుపుతున్నదని.. స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో మతవిద్వేశాన్ని రెచ్చగొడుతుందన్నారు. భారత రాజ్యాంగ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు.కార్మిక,కర్షక,కష్టజీవుల డిమాండ్ల పరిష్కరానికి తలపెట్టిన ఛలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు సంయుక్తంగా కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి అమ్ముల బాల్‌నర్సయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కనకాచారి, తెలంగాణ వ్యవసా య కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కనకయ్య, సీఐటీయూ మండల కమిటీ సభ్యులు ఐలయ్య ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ సమగ్రాభివృద్ధికి కృషి



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపాల్టీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం మున్సిపల్ పరిధిలోని మండే మార్కెట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డిల సమక్షంలో బీరంగూడ రజక సంఘం అధ్యక్షులు మహేష్ అధ్వర్యంలో భారీ సంఖ్యలో కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహాయ సహకా రాలతో ప్రతీకాలనీనీ ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు , బి ఆర్ ఎస్ పార్టీ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ 2
సంగారెడ్డి
సోమవారం 06 మార్చి 2023



వెలిమల మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-రామచంద్రాపురం

మానసిక ప్రశాంతత కోసం ప్రజలందరూ దైవభక్తిని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమలలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయ కమిటీ నిర్వాహకులు, యాదవ సోదరులు తమ సాంప్రదాయ రీతిలో గొంగడి, మేకపిల్లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, వెలిమల కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, సుచరిత కొమరయ్య, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పటాన్‌చెరు బస్టాండ్‌లో దుకాణాలకు టెండర్ల ఆహ్వానం

నవతెలంగాణ-పటాన్‌చెరు

హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ పరిధిలోని పటాన్‌చెరు బస్సు స్టేషన్‌లో ఖాళీగా ఉన్న దుకాణాల కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు హెచ్‌సియు డిపో మేనేజరు శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 10 సాయంత్రం 5 గంటల వరకు బిడ్లు సమర్పించుకునే అవకాశం వుందన్నారు. ఔత్సాహికులు ఈ టెండర్లలో కూడా పాల్గొనవచ్చన్నారు. ఈనెల 13 ఆఖరి తేదిగా నిర్ణయించినట్టు డిపో మేనేజరు తెలిపారు. షాప్‌ల ఖాళీల వివరాలు, నిర్వహించాల్సిన వ్యాపారాలు ఈఎండిలను వివరించారు. పటాన్‌చెరు పట్టణంలో వివిధ వ్యాపారాలు నిర్వహించుటకు అత్యంత అనువైన, లాభదాయకమైన షాపింగ్ సవ యదాయం పటాన్‌చెరు బస్టాండ్ అని.. దీన్ని ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959226132 నెంబరుకు సంప్రదించాలన్నారు.



నల్ల సూర్య ప్రకాష్‌ను కలిసిన సత్యం

నవతెలంగాణ-సంగారెడ్డి

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్‌ను బహుజన నేషనల్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యం ఆదివారం హైదరాబాద్‌లోని సూర్యప్రకాశ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బహుజన నేషనల్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా భాధ్యతలు తీసుకున్నందున ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బహుజన్ నేషనల్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పద్మారావు, పార్లమెంట్ ఇంచార్జీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బుదేరా మహిళా డిగ్రీ కాలేజీలో సీఓఈ, టీజీయూజీ సెట్ పరీక్షలు

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని బుదేరా చౌరస్తాలో గల గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సీఓఈసెట్, టీజీయూజీ సెట్ ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఆరాఫా తెహసీన్ తెలిపారు. ఈసందర్భంగా సీఓఈసెట్‌కు మొత్తం 356 మందికిగాను 318 మంది, టీజీయూజి సెట్‌కు 303 మందికి గాను 279మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు.



సమ్మక్క సారక్క తల్లుల సేవలో నందారం

నవతెలంగాణ-అమీన్‌పూర్

వనదేవతలు మేడారం సమ్మక్క సారమ్మ సేవలో అమీన్పూర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ నందారం నరసింహా గౌడ్ పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీవాసులతో కలిసి మేడారం సమ్మక్క సారలమ్మ దర్శనానికి బయలుదేరి వెళ్లారు. అక్కడ కాలనీ వాసులతో కలిసి కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వైస్ చైర్మన్ నందారం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వచ్చే ఎన్నికల్లో అఖండ విజయం సాధించడంతోపాటు దేశ రాజకీయాల్లో చక్రం తిప్పేలా దీవించాలని మొక్కుకున్నారు.



కో-ఆప్షన్ సభ్యుడికి కర్ణాటక పీసీసీ నాయకుల సన్మానం

నవతెలంగాణ-జహీరాబాద్

మొగుడంపల్లి మండల కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన అర్షద్ జమా పటేల్‌ను కర్ణాటక పీసీసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం అర్షద్ జమా ఇంటికి వచ్చిన కర్ణాటక పీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి సయ్యద్ సమియోద్దీన్ వారి నాయకులతో కలసి పూలమాల శాలువాతో సన్మానించారు. అనంతరం మాటాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి.. సేవలు చేసేటటువంటి వారి ఇంటి వద్దకు పదవులు వస్తాయని.. ఇది కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో రషీద్, నశీర్, జాఫర్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని పాత ఆర్టీఏ చెక్‌పోస్ట్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద సుమారు 45 ఏండ్లున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో సదరు వ్యక్తి మృతి చెందినట్టు పట్టణ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రోడ్డుపై వెళ్ళుతున్న ప్రయాణికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో భద్రపరిచినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు ప్యాంట్, షర్ట్ ధరించి ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని.. ఎవరైనా మృతదేహాన్ని గుర్తుపడితే తక్షణమే జహీరాబాద్ పోలీసులకు సంప్రదించాలన్నారు.

ఓపెన్ స్కూల్ ఓ వరం లాంటిది

నవతెలంగాణ-జోగిపేట



చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఒక వరం లాంటిదని ఓపెన్ స్కూల్ రాష్ట్ర కోఆర్డి నేటర్ బి. పద్మ అన్నారు. ఆదివారం జోగిపేట ఓపన్ స్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువు మధ్యలో మానేసిన వారు ఈ అవకాశాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. సెంటర్లో ఓపన్ స్కూల్‌కి సంబంధించిన వివిధ రకాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ జి.వెంకటస్వామి, జోగిపేట సెంటర్ అస్టెంట్ కో ఆర్డినేటర్ యస్ .కృష్ణయ్య, అధ్యాపకులు యస్.నరోత్తమ్ కుమార్ త్రినాథరావు, విజయ్ కుమార్‌లు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు మంత్రి హరీశ్‌రావు పర్యటన

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలో నేడు(సోమవారం) రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటి ఉదయం 9:00 గంటలకు సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో జీ.ఓ 59 లబ్ధిదారులకు ఇంటి స్థల రిజిస్ట్రేషన్ దస్తావేజులను పంపిణీ చేస్తార న్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో పాల్గొం టార న్నారు. 10:00 గంటలకు సంగారెడ్డి పట్టణంలోని మెడికల్ కళాశాలను సందర్శిస్తారని, 10:30 గంటలకు జి ల్లా ఆస్పత్రి వద్ద క్రిటికల్ కేర్ యూనిట్కు శంకుస్థాపన చేస్తార న్నారు. ఉ.10:45 గంటలకు రేడియాలజీ ల్యాబ్‌ను ప్రారంభించి.. 11 గంటలకు జిల్లా ఆస్పత్రిలోని వెల్నెస్ సెంటర్ వద్ద పోలీస్ అధికారుల మెడికల్ క్యాంపును సందర్శిస్తారన్నారు. 11:15 గంటలకు రజాక్ కిరాణా స్టోర్స్ నుండి కింది బజార్ వరకు నిర్మించనున్న స్ట్రీమ్ వాటర్ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. 11:30 గంటలకు తార డిగ్రీ కళాశాల లో నిర్మించిన అదనపు తరగతి గదు లను ప్రారంభిస్తారని, 11:45 గంటలకు సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని పాత డిఆర్డిఏ ప్రాంగణంలో నిర్మించనున్న టీఎన్జీ వో భవనానికి శంకుస్థాపన, మధ్యాహ్నం 12:00 గంటలకు జెడ్ఎంఎస్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి స్వయం సహాయక సంఘాల మహిళ సభ్యులను ఉద్దేశించి మంత్రి ప్రసంగిస్తారన్నారు. మధ్యాహ్నం 12:15 గంటలకు సంగారెడ్డి బైపాస్ రోడ్డు నుండి ధ్రువ ఆస్పత్రి వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన, 12:35 గంటలకు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఒంటిగంటకు సంగారెడ్డి నుండి పటాన్చెరుకు వెళ్తారని, మ.1:30 గంటలకు పటాన్చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడు కలలో పాల్గొంటారన్నారు. 2:45 గంటలకు పటాన్చెరు నుండి బయలుదేరి సదాశివపేటలో స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అక్కడి నుంచి సా.4:00 గంటలకు బయలుదేరి 4:30 గంటలకు కో హిర్‌లో నూతనంగా నిర్మించిన 50 పడకల ఆసుపత్రి భవ నాన్ని ప్రారంభిస్తార న్నారు. సా.5:00 గంటలకు జహీరాబాద్ పట్టణంలో డీసీఎంఎస్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని, సా.5:30 గంటలకు బర్ది పూర్ ఆశ్రమాన్ని సందర్శించి, తిరిగి మంత్రి హైదరాబాద్ వెళ్తారని పేర్కొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

- పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- రూ.1.90 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో మసీదు, రామాలయం భూమి పూజ కార్యక్రమాలకు ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం 8వ వార్డు వెంకటరమణ కాలనీలో కోటి 90 లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, ప్రతీ ఒక్కరూ పరమత సహనాన్ని పాటించాలని కోరారు. నియోజకవర్గంలో కులాలు, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రార్థన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ ఆర్థిక సహకారం అందిస్తున్నామన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు వందల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నామన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు



- ఆటాపాటలతో అలరించిన విద్యార్థులు
- ముఖ్య అతిథిగా కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నిర్దేశించించుకుని.. అందుకు అనుగుణంగా కృషి చేయాలని ప్రముఖ సంఘ సేవకుడు, బీజేపీ సీనియర్ నేత కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం బొల్లారం మున్సిపల్‌లో జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వార్షికోత్సవంలో జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ సతీష్‌తో కలిసి కృష్ణారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. నేటి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యా బోధన అంశాలను చేపడుతున్నా మన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రణాళిక బద్ధంగా చదివితే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ నాగమణి, కోఆర్డినేటర్ స్మిత భోగరాజు, ఎస్ ఐ వెంకట్ రెడ్డి,ఉపాధ్యా యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు,పాఠశాల యజమాన్యం, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వమిచ్చిన హామీలను అమలు చేయాలి






నవతెలంగాణ-సంగారెడ్డి

కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్ అన్నారు. కల్లు గీత కార్మిక సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్ నాయకులు వీరగోని చెన్న గౌడ్ రెండో వర్ధంతి సందర్భంగా ఆదివారం కల్లుగీతకార్మిక సంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆశన్న గౌడ్ మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికుల ఉపాధి కోసం, గౌడ కులస్తుల సంక్షేమం కోసం పేదల పక్షాన పోరాడిన నాయకులు చేన్న గౌడ్ సేవలు చిరస్మరణీయమన్నారు. కల్లు గీత వృత్తి రక్షణ కోసం, రాష్ట్ర బడ్జెట్ నిధులు కేటాయించాలని.. వాటిని వెంటనే ఖర్చు చేసి గీత కార్మికులు ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలను. వెంటనే అవలు చేయాలన్నారు. చేన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో గౌడ సోదరులందరూ గీత కార్మికులందరూ ఐక్యమత్యంతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు.సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.


మునిపల్లి : మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం సీనియర్ నాయకులు వీరగోని చేన్న గౌడ్ రెండో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. గీత కార్మికుల హక్కుల కోసం పేదల పక్షాన పోరాడిన నాయకుడు చేన్న గౌడ్ అని.. ఆయన ఆశయ సాధన కోసం, ఆయన స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల గీత కార్మికులకు ఉపాధి కోసం తాటి, ఈత చెట్లను ఇస్తే వాటిని రియల్ ఎస్టేట్ వాళ్లు ధ్వంసం చేస్తున్నారని.. వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చిలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆందోళన చేస్తామన్నారు. నాగరాజు గౌడ్, చంద్రయ్య గౌడ్, నరసింహ గౌడ్, ఎల్లా గౌడ్, రమేష్ గౌడ్, నారాయణా గౌడ్, లక్ష్మణ్ గౌడ్, సంఘ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.



వైభవంగా ఆచార్యుల జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ- సదాశివపేట

సదాశివపేట పట్టణ పరిధిలోని చౌకిమఠంలో ఆది జగద్గురు శ్రీ రేణుకాచార్యుల జయంతి వేడుకలను అధ్యక్షులు చీలమల్లన్న ఆధ్వర్యంలో ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరశైవ ధర్మ స్థాపకులు రేణుకా చార్యుల జయంతోత్సవం వీరశైవులకు అత్యంత ప్రీతికరమైన పండగ అని .. ఈ జయంతి ఉత్సవాలను వీరశైవ వీరశైవ లింగాయత్ కుల బాంధవులు అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. గౌరవ అధ్యక్షులు బోడగామ శ్రీశైలం, కోశాధికారి పులుమామిడి వీరేశం, ఉపాధ్యక్షులుగా, బస్వరాజు,నాగన్న, బుచ్చప్ప, విశ్వేశ్వర్, అర్చకులు, మహేష్ స్వామి,సభ్యులు పాల్గొన్నారు.



అనసూయ కుటుంబానికి నీలం మధు సాయం

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలం పెద్దమ్మగూడెం గ్రామానికి చెందిన గుర్రాల అనసూయ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలిసి బీఆర్ఎస్ రాష్ట్ర నేత, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ ఐదు వేల రూపాయల అందజేయించారు. ఈ మేరకు ఆదివారం పెద్దమ్మ గూడ ఎంఎంఆర్ యువసేన నాయకులు బాధిత కుటుంబానికి ఈ సాయాన్ని అందజేశారు. సాయిరాం యాదవ్, హన్మంత్ యాదవ్ మహేష్ యాదవ్, నర్సింలు యాదవ్, మహేశ్ యాదవ్, నాగరాజు యాదవ్, నవీన్ యాదవ్,పవన్ యాదవ్ లు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించగలరు



నవతెలంగాణ-సంగారెడ్డి

మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించగలరని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం సంగారెడ్డి స్థానిక బాలికల పాఠశాల నుంచి బస్టాండ్ వరకు బాలికలతో నిర్వహించిన సైకిల్ ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సంవత్సరం 'ఆరోగ్య మహిళ.. ఆరోగ్య భారతం' అన్న నినాదంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. బాలికలు సైకిల్ పైనే పాఠశాలలకు రావాలని, దానితో శారీరకంగా బలంగా తయారవుతారన్నారు. మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. మహిళలు రోజు వారి వ్యాయామం చేయడం, పోషకాహారం తీసుకోవడంతో సాధారణ జబ్బులు రావన్నారు. రోజుకు కనీసం 30 నిమిషాల పాటు నడవడం లేదా సైక్లింగ్ చేయడం ద్వారా బిపి, షుగర్ లాంటి జబ్బులు దరిచేరవని, ఉన్నా నియంత్రణలో ఉంటాయన్నారు. జిల్లాలో త్వరలో కొన్ని కేంద్రాలలో మహిళ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించబోతున్నట్లు ఆమె వెల్లడించారు. డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ నాగ నిర్మల, మార్క్స్ నగర్ యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శశికర్, శ్రీరామ్ సుధాకర్, నవాజ్ అలీ, మీనా, మాధవి, సంపూర్ణ, వీరమని, షాహిన్, శారద, భారతి తదితరులు పాల్గొన్నారు.

అందరి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-జిన్నారం

అన్ని వర్గాల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తున్నదని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని గడ్డపోతారం గ్రామ పరిధిలో గల అయ్యమ్మ చెరువు కట్ట మైసమ్మ బోనాల జాతరలో ఆదివారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలంటూ ఆకాంక్షించారు. అనంతరం ఊట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన మసీదును ప్రారంభించారు. రాళ్లకత్వ గ్రామంలోని యువకులకు స్పోర్ట్స్ డ్రెస్సులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటైన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టితో ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారనారు. క్రీడారంగం పట్ల యువత ఆసక్తినీ ద్విగుణీకృతం చేసేలా క్రీడా పోటీలు విరివిగా నిర్వహిస్తు న్నామన్నారు. ఈ



కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేష్ గౌడ్, సర్పంచులు పులిగిల్ల ప్రకాశం చారి, ఆంజనేయులు, నాయకులు రాజేష్ భీమ్రావు శ్రీధర్ గౌడ్,స్వాతి ప్రభాకర్ రెడ్డి, కృష్ణ గౌడ్ రామకృష్ణ,శాంత వర్మ రెడ్డి అగ్రహారం కుమార్, మాజీ సర్పంచ్ వెంకట్రామ్ రెడ్డి, అండూరు సర్పంచ్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త పోరాటాలు



- ఏప్రిల్ 5న లక్షలాది మందితో ఢిల్లీలో మహాధర్నా
- కార్మికుల కోసం పోరాడేది సీఐటీయూనే
- కిర్బీ పరిశ్రమ అభినందన సభలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

నవతెలంగాణ-రామచంద్రాపురం

మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా పోరాటలు చేయాలని సీఐటీయూ నిర్ణయించిందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. అందులో భాగంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో లక్షలాది మందితో మహా ధర్నా నిర్వహిం చనున్నట్టు తెలిపారు. కిర్బీ కార్మికుల వేతన ఒప్పందం పూర్తయిన సందర్భంగా భారతినగర్ డివిజన్‌లోని ఎల్ఐజీ ఫంక్షన్ హాల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చుక్క రాములు హాజరై ప్రసంగించారు. లేబరు కోడ్‌లను మోడీ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం యూనియన్ల రహిత, హక్కులు లేని పరిశ్రమలు ఉండాలని కోరుకుంటున్నారన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాల రక్షణ కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు. ప్రైవేటీకరన విధానాలను రద్దు చేయాలన్నారు. ధరలను అదుపు చేయలేని మోడీ ప్రభుత్వం గద్దె దిగాలన్నారు. కార్పోరేట్ల కోసం మతోన్మాదం పెంచి పోషిస్తున్న మోడీ విధానాలపైన కార్మిక వర్గం పోరాడాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే మల్లికార్జున్, రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్యలు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు సీఐటీ యూ ద్వారానే పరిష్కారం అవుతాయన్నారు. కిర్బీలో మంచి వేతన ఒప్పందం సాధించామన్నారు. తక్కువ సమయంలో చారిత్రకమైన ఒప్పందం చేసామని, ప్యాకేజీతో పాటు వీడిఏ అనేక సౌకర్యాలు సాధించామన్నారు. ఒప్పందలు చేయడంలో సీఐటీయూకు సాటి లేదన్నారు. సీఐటీయూ నాయకులు వాజిదలి, పాండురంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మధుసూదన్, వేణుగోపాల్, వాళ్లతో పరిశ్రమ యూనియన్ నాయకులు వీఎస్ రాజు, మల్లేష్, తలారి శ్రీనివాస్, ఏడుకొండలు, నాగప్రసాద్, సుధాకర్, శంకర్, విఠల్, గోపాల్, మహేశ్వర్ రెడ్డి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఇంటెక్ వెల్ మోటార్ల కేబుల్ వైర్ దొంగతనం

నవతెలంగాణ-వట్‌పల్లి

ఇంటెక్ వెల్ నుంచి సంపులోనికి నీటిని తొడెందుకు ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను కొందరు వ్యక్తులు ట్రాక్టర్ల సాయంతో దొంగ తనం చేశారు. ఈ మేరకు మిషన్ భగీరథ ఏఈ రవి ఆదేశాలతో ఆపరేటర్ నాగరాజు వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే..

మంజీరా నది పరిపాహాక ప్రాంతమైన ఖాదీరాబాద్‌లో ఇంటెక్ వెల్ తాగునీటి పథకాన్ని నిర్మించి.. దాని ద్వారా సమీపంలోని సంపులోనికి నీటిని తోడెందుకు మోటార్లకు కేబుల్ వైర్ల ద్వారా కనెక్షన్లు ఇచ్చారు. అయితే ఈ కేబుల్ వైర్లను గ్రామానికి చెందిన ఓ ముగ్గురు వ్యక్తులు ట్రాక్టర్ల సాయంతో శుక్రవారం రాత్రి దొంగలిం చారు. మూత్ర విసర్జన్ కోసం బయటికి వచ్చిన ఓ ఇద్దరు వ్యక్తులు ఈ దొంగతనాన్ని చూసి ప్రశ్నించారు. అయితే ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి.. దుండగులు కేబుల్ వైర్లను



ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని సంపు ఆపరేటర్, మిషన్ భగీరథ ఏఈకి వారు తెలిపారు. దీంతో సంపు ఆపరేటర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాఆదు చేశారు. కాగా ఖాదీరాబాద్ గ్రామానికి చెందిన ఓ ముగ్గురు వ్యక్తులు ఈ దొంగతనం చేసినట్టు తెలిసిందని.. త్వరలోనే వారిని పట్టుకుని కేబుల్ వైర్లను స్వాధీనం చేసుకుంటాని పోలీసులు తెలిపారు.

ఎస్వీ జూనియర్ కాలేజ్‌లో వీడ్కోలు వేడుకలు



నవతెలంగాణ-సంగారెడ్డి

స్థానిక సంగారెడ్డి పట్టణంలోని ఎస్వీ జూనియర్ కాలేజ్‌లో జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వి కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ కోల్పోతే వారి జీవితాలు గాడి తప్పుతాయని, భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని అని అన్నారు. కాబట్టి విద్యార్థులకు చదువుతోపాటు చక్కని క్రమశిక్షణ అవసరమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సంగారెడ్డి పట్టణ సీఐ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. సంకల్ప బలానికి దైవ బలం తోడైతే అసాధ్యాలను సుసాధ్యం చేయగలమన్నారు. చక్కని కథ ద్వారా సందేశాన్ని అందించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఐఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ అజిత్ కనకాంబరన్ మాట్లాడుతూ.. ఐఐటి హైదరాబాద్ అందించే కోర్సులు, అవకాశాల గురించి విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వి జూనియర్ కళాశాల చైర్మన్ అరుణ కుమార్ రాజా, డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో వీడ్కోలు సమావేశం అట్టహాసంగా ముగిసింది.

మైసమ్మ తల్లి ఉత్సవాల్లో పాల్గొన్న కాటా శ్రీనివాస్

నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని గడ్డపోతారం గ్రామంలో ఆదివారం నిర్వహించిన కట్ట మైసమ్మ తల్లి బోనాల జాతర ఉత్సవాలలో భాగంగా ఆలయ పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్, జిన్నారం ఎంపీపీ అధ్యక్షులు దమ్మ గౌని రవీందర్ గౌడ్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎంపీటీసీ జనాభాయ్ నిర్వాహకులు భక్తులు వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ గౌడ్,ఎంపీపీ ఉపాధ్యక్షులు గంగు రవేష్, జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే క్రిష్ణ, సోలక్ పల్లి సర్పంచ్ దాసరి శ్రీకాంత్ రెడ్డి, గడ్డపోతారం ఎంపీటీసీ జనాబాయి,ఉప సర్పంచ్ రవీందర్, చంద్రయ్య



వై నరేందర్ గౌడ్, క్రిష్ణమోహన్, రాములు, కె అర్జున్, సి అర్జున్, కుమార్, బాలయ్య, నాగరాజు, సాయి, విజయ్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.



జయహో తులసి మాత

చాముండేశ్వరి క్షేత్రంలో అమ్రిష్ ప్రీతి హీరో హీరోయిన్లుగా చిత్రం షూటింగ్



నవతెలంగాణ-చిలిపిచెడ్ : చిట్కుల్ మంజీర పరిహార ప్రాంతంలో ఉన్న చాముండేశ్వరి ఆలయం వద్ద జయహో తులసీమాత సినిమాను విష్ణుదేవ్ చౌబే సమర్పణలో షూటింగ్ నిర్వహిస్తున్నారు. గత పది రోజులుగా చిలిపిచేడు మండలంలో షూటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ షూటింగుకు ప్రస్తుతం క్లైమాక్స్ నిర్వహిస్తున్నారు. ఈ చిత్రానికి డైరెక్టర్ దినేష్ యాదవ్, నిర్మాత విష్ణుదేవ్ చౌబే, చిలిపిచేడ్ మండల టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చౌటకూరి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

అత్తగారు బంగారం పెట్టలేదని కరెంటు స్తంభం ఎక్కిన యువకుడు



నవతెలంగాణ-మెదక్ టౌన్ : అత్తగారు బంగారం పెట్టలేదని యువకుడు విద్యుత్ స్తంభం ఎక్కిన ఘటన జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని గాంధీనగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణానికి చెందిన శేఖర్ ఎలక్ట్రీషన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలం క్రితం రాజ్‌పల్లికి చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో తమ పెళ్లికి అత్తగారు బంగారం పెట్టలేదని మనస్తాపంతో కరెంటు స్తంభం ఎక్కాడు. దీంతో అప్రమత్తమైన స్థానికులు విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. అనంతరం అక్కడికి చేరుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, డీఎస్పీ సైదులు, పట్టణ పోలీసులు అతడికి నచ్చజెప్పడంతో కిందకు దిగి వచ్చాడు. దీంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

మార్కండేయ దేవాలయ నిర్మాణానికి రూ.51 వేల విలువచేసే ఇసుక అందజేత



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న మార్కండేయ దేవాలయ నిర్మాణానికి ఆదివారం రెడ్డిపల్లి ఉపసర్పంచ్ అశోక్ గౌడ్ తన వంతు సహాయంగా రూ.51 వేల విలువచేసే ఇసుకను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆంజనేయులు గౌడ్, నాయకులు భూమా గౌడ్, కిష్టా గౌడ్,, శేఖర్ ,యాదగిరి , పద్మశాలి సంఘం నాయకులు ఉన్నారు.

బహుజనుల ముద్దుబిడ్డ అంబేద్కర్

బచ్చు రాజు పల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ



నవతెలంగాణ-నిజాంపేట

బహుజనుల ముద్దుబిడ్డ, రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని జెడ్పీటీసీ పంజా కుమార్ అన్నారు. నిజాంపేట మండల పరిధిలోని బచ్చురాజ్ పల్లి గ్రామంలో నవ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్, విగ్రహ దాత గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ అనే గొప్ప వ్యక్తి అని, అందరివాడని. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు అనే ఆయుధాన్ని కల్పించిన గొప్ప మహనీయుడన్నారు.. కుల మతాలను పక్కనపెట్టి పిల్లలకు మంచి విద్యను అందించినట్లయితే భవిష్యత్తులో ఉన్నత స్థాయిని అధిగమిస్తారన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నరసింహారెడ్డి, శివప్రసాద్, ఎంపీటీసీలు లద్ద సురేష్, రాజిరెడ్డి, అక్షయ్, చల్మెడ ఉప సర్పంచ్ తుమ్మల రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గర్గుల శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు జిపి స్వామి, జాల పోచయ్య బాబు, నీలం తిరుపతి, సురేష్ నాయక్, లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ స్వామి, చంద్రయ్య, అంబేద్కర్ నవనిర్మాణ కమిటీ సభ్యులు స్వామి, బాబు, సుధాకర్, రాజు, దేవానందం, ప్రవీణ్, రాజశేఖర్, భాస్కర్, పరంజ్యోతి, ప్రవీణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించారు లక్షణంగా వదిలేశారు

- నిరుపయోగంగా రేగోడు బస్టాండ్





నవతెలంగాణ-రేగోడు

మండల కేంద్రమైన రేగోడులో 20 సంవత్సరాల కిందట లక్షలు వెచ్చించి నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను లక్షణంగా వదిలేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ హయాంలో మాజీ మంత్రి బాబు మోహన్ చేతుల మీదుగా రేగోడు బస్టాండ్ నిర్మాణానికి 1998లో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 2021లో లక్షల రూపాయలతో బస్టాండ్‌ను నిర్మించారు కానీ ఆ బస్టాండ్ లో కొద్దిరోజులు మాత్రమే బస్సులు అక్కడికి వచ్చి ఆగాయి. ఆ తరువాత బస్టాండులోకి బస్సులో రాకపోవడంతో లక్షలు వెచ్చించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ఇప్పుడు ముందే ఎండాకాలం ప్రయాణికులు బస్సుల కోసం వస్తే ఎక్కడ కూర్చోవాలో తెలియక హెూటళ్ళ, పాన్‌డబ్బాలు, కూల్ డ్రింక్ షాపులో కూర్చోవాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌లోకి బస్సులను తీసుకువస్తే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని మండల ప్రజలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు రేగోడు గాంధీచౌక్ వద్ద ఆగడంతో అక్కడ ఆటోలు వివిధ వాహనాలు ఉండడంతో ఇబ్బందిగా ఉంటుందని రేగోడు గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మెదక్ చేగుంట రోడ్డు

జరభద్రం



నవతెలంగాణ-మెదక్ రూరల్

ప్రమాదాలు పొంచి ఉన్నాయని తెలియకుండా వాహనదారులు పగటిపూట, రాత్రి వేళలో వెళుతూ పమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వం రహదారుల కోసం కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసినా, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మూలంగా గుంతలు పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. గత కొన్ని రోజుల క్రితం మెదక్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి రాచపల్లి బస్టాండ్ ప్రక్కన పెద్ద గుంత లో పడి ప్రాణాలు వదిలాడు. ఇలా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం దారుణం. రోజు ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు వెళ్లే దారిలోనే ఇలా ఉంటే మారుమూల ప్రాంతాలలో రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాల్సిందే. మెదక్ పట్టణంలో ఎస్పీ కార్యాలయం ప్రక్కన గుంత ప్రమాదకరంగా మారిందని ఎన్నిసార్లు చెప్పినా అధికారులు, కాంట్రాక్టర్లు నిమ్మకు నీరు ఎత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. మెదక్ పట్టణం హౌసులపల్లి పాతూరు శమ్నాపూర్ గంగాపూర్ మీదుగా నూతనంగా రోడ్డు వెడల్పు కార్యక్రమం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలను తొలగించే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. దీంతో వాహనదారుల రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా మారింది. దారిలో ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు లేకపోవడం, వాహనదారుల కళ్లల్లో దుమ్ము దూళి పడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

మా ప్రాణాలు అంటే అంత చులకన

కాంగ్రెస్ పార్టీ నాయకుడు మార్గం ఆంజనేయులు



బస్టాండ్ పక్కన ఉన్న గుంతల్లో పడి ఎంతోమంది ప్రాణాలు పోయాయి. కాళ్ల చేతులు విరిగాయి అయినా ఎవరు పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డుపైన ఎప్పుడూ అధికారులు వెళ్తూనే ఉంటారు కానీ మా ప్రాణాలంటే అధికారులకు చులకనైపోయింది. ఇప్పటికైనా స్పందించి ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

విద్యార్థులకు ఇంటర్ దశ ఎంతో కీలకం

ఎస్సై శివకుమార్

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు





నవతెలంగాణ-నర్సాపూర్

విద్యార్థులకు ఇంటర్ దశ ఎంతో కీలకమైందని నర్సాపూర్ ఎస్సై శివకుమార్ అన్నారు. ఆదివారం నర్సాపూర్ మండల పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వైష్ణవి జూనియర్ కళాశాలలో చదువుతున్న సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ ఇంటర్ దశలోని విద్యార్థుల జీవితం ఎటువైపు ప్రయాణించాలని ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. తమ కళాశాల నుంచి ప్రతి సంవత్సరం వెలువడుతున్న ఇంటర్ ఫలితాల్లో నియోజకవర్గస్థాయిలో నెంబర్ వన్ గా నిలుస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరింప చేశాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పృథ్వి గౌడ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు ఉన్నారు.

దత్తత గ్రామమంలోనే అభివృద్ధి శూన్యం

- అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం
- డీసీసీ అధ్యక్షులు కంఠా రెడ్డి తిరుపతి రెడ్డి



నవతెలంగాణ -పాపన్నపేట

హత్ సే హత్ జోడో కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాపన్నపేట మండలం యూసఫ్ పేట, ఆరెపల్లి గ్రామాల్లో ఇంటింటికి వెళ్తూ ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టే కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా అధ్యక్షులు కంఠా రెడ్డీ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ గతంలో యూసప్ పేట గ్రామన్ని ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి గారు దత్తత తీసుకున్నట్లు ప్రకటించారని, మరి నేడు ఈ గ్రామంలో ప్రతి వీధికి వెళ్లి తిరిగాను ఎక్కడ చూసినా కూడా గతంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి మాత్రమే కనబడుతుంది తప్ప బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన ఒక అభివృద్ధి కార్యక్రమం లేదని దుయ్యబట్టారు, నియోజకవర్గంలో అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమేనన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయిందన్నారు. అలాగే రైతులెవరు అప్పులు కట్టవద్దని వచ్చే సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫి చేస్తామని తెలిపారు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 వందలకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామో అలాగే తెలంగాణ రాష్ట్రంలో కూడా అధికారంలోకి రాగానే రూ.500 వందలకే సిలిండర్ ఇస్తామని తెలిపారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ నాయకులు సుప్రభాత రావు, మామిళ్ల ఆంజనేయులు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డీ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, మండల అధ్యక్షులు గోవింద్ నాయక్, హాఫిజ్ ఉద్దిన్, శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, రమేష్, రమేష్ రెడ్డీ శ్రీకాంత్ రెడ్డీ, సతీష్ కుమార్, రాజశేఖర్, బాగా రెడ్డి, ఖలీమ్, నాగరాజు, శం రెడ్డీ, ఉదయ్ కుమార్, ఇతరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నవతెలంగాణ-చిన్న శంకరంపేట

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్, టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలంలోని రామాయపల్లి ప్రధాన రోడ్డుపై జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఎస్ కొండాపూర్ గ్రామానికి చెందిన గడ్డమీద దుర్గయ్య (55) విద్యుత్ శాఖలో తాత్కాలిక కూలీ పని చేస్తున్నాడు. టీవీఎస్ ఎక్సెల్‌పై ఖాజాపూర్ నుంచి ఎస్ కొండాపూర్‌కు తిరిగి వస్తున్న క్రమంలో గవ్వల పల్లి నుంచి రామాయంపేట వైపు వెళుతున్న ఐషర్ ట్రాక్టర్ ఢీకొట్టింది. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడపడంతో రామాయపల్లి గ్రామ శివారులో గల ప్రధాన రోడ్డుపై టీవీఎస్ ఎక్సెల్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో దుర్గయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి కుమారుడు, ఇద్దరు భార్యలు ఉన్నారు. గ్రామస్తులు అక్కడికి చేరుకొని ట్రాక్టర్ యజమాని ఘటన స్థలానికి రావాల్సిందేనని రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. పోలీసులు సర్ది చెప్పి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని మెదక్ మర్చురికి తరలించినట్లు స్థానిక ఎస్సై సుభాష్ గౌడ్ తెలిపారు.

నేడు ఎంపీపీగా వెంకట నర్సింగ్ రావు బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ ఎంపీపీగా పి వెంకట నర్సింగ్ రావు సోమవారం పదవి బాధ్యతలు చేపట్టనున్నారని ఎంపీడీవో మార్టిన్ లూథర్ ఆదివారం తెలిపారు .ఇప్పటివరకు ఎంపీపీగా ఉన్న జ్యోతిపై అధికారులు వేటు వేసిన విషయం తెలిసిందేనన్నారు. ఆమె స్థానంలో ప్రస్తుత వైస్ ఎంపీపీగా వ్యవహరిస్తున్న వెంకట నర్సింగ్ రావుకు ఎంపీపీగా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పదవీ బాధ్యతల స్వీకరణ నర్సాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ సునీత రెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, వప్రజాపప్రతినిధులు హాజరు కావాలని ఎంపీడీవో మార్టిన్ లూథర్ కోరారు.

కేసీఆర్ అభివృద్ధి లక్ష్యమే నా దారి

డబుల్ బెడ్ రూమ్, కోట మైసమ్మ రోడ్డు త్వరలోనే కొలిక్కి వస్తుంది

మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి



నవతెలంగాణ- గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం అభివృద్ధి ప్రధానమని, అదే లక్ష్యంతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధిలో ముందుకు వెళుతున్నానని మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. ఆదివారం 'నవ తెలంగాణ'తో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిల ఆలోచనలకు అనుగుణంగానే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధి ముందుకు వెళుతుందన్నారు. డబుల్ బెడ్ రూమ్ దరఖాస్తు చేసుకున్న పేదలందరికీ ప్రభుత్వం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని అందులో నిరుపేదలను గుర్తించాలన్నారు. ప్రభుత్వం ఉన్నంత అధికారులు ఆదర్శంగా అడుగులు వేస్తున్నారని ఆయన చెప్పారు. నిరుపేదలకు ఎవరికి అన్యాయం చేయమని ఆయన అన్నారు. ఎవరో అపవాదులు మోపినంత మాత్రాన అభివృద్ధి విషయంలో మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిల కృషితో ముందుకు వెళ్తానన్నారు. సూచనలు సలహాలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. డబుల్ బెడ్ రూమ్, కోట మైసమ్మ రోడ్డు విషయంలో తాను వ్యక్తిగతంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవడం లేదని, వాటిని పూర్తిచేసి బాధ్యతగా ముందుకు వెళ్దామన్నారు. అందరితో కలిసి ముందుకు వెళ్తానని ఆయన చెప్పారు. వ్యక్తిగత అభిప్రాయాలు అందరికీ ఉంటాయన్నారు. ని అభివృద్ధిలో మాత్రం కలిసి వెళ్తామన్నారు. కోట మైసమ్మ రోడ్డు త్వరలో పూర్తి చేస్తామన్నారు. దీనికి ప్రజలు సహకరించాలన్నారు. రోడ్డు భవనాలు శాఖ అధికారులు ఇప్పటివరకు జరిగిన మురికి కాలువల నిర్మాణం పూర్తయిన చోట రోడ్డు పూర్తి చేయాలని రోడ్డు భవనాల శాఖ అధికారులను కోరినట్లు ఆయన చెప్పారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధిలో ముఖ్యమంత్రి సూచించిన మేరకే పనులు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. అభివృద్ధి పనులకు ఒకరు అడ్డుపడతారని చెప్పడం బాధనిపించిందన్నారు. గజ్వేల్ అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిల సలహాల మేరకే ముందు వెళ్తున్న అన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి , మున్సిపల్ పాలకవర్గం సభ్యుల సలహాలు కూడా తీసుకుంటున్నామని అభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు. డబుల్ బెడ్ రూమ్ విషయంలో రెవెన్యూ అధికారులే పూర్తిస్థాయిలో బాధ్యత తీసుకొని సర్వే నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులకు జోక్యం ఉందని చెప్పడం మంచిది కాదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు ఎలాంటి జోక్యం లేదని జిల్లా ఉన్నంత అధికారి ఆదేశాల మేరకు సర్వే అధికారులు సర్వే చేసి నిరుపేదలను గుర్తిస్తున్నారని ఆయన చెప్పారు.

ఫోటోగ్రాఫర్ కుటుంబానికి రూ.1.80 లక్షల చెక్కు

రాష్ట్ర ఫోటోగ్రాఫర్ల సంఘం తరపున అందజేత

నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణానికి చెందిన ఫోటోగ్రాఫర్ గడ్డం ఆంజనేయులు అకస్మాత్తుగా గుండెపోటుతో ఇటీవలే మృతి చెందాడు. ఈయనపై ఆధారపడ్డ కుటుంబం రోడ్డున పడింది. చిన్ననాటి కల నెరవేర్చడానికి ఫోటోగ్రాఫర్‌గా మారి అదే వృత్తిగా భావించి జీవితం అంతం వరకు ఫోటోలు తీస్తూ అందరిని బతికిస్తూ సమయానికి ఫోటోలు అందిస్తూ మండల వ్యాప్తంగా ఉన్న ప్రజానీకాని కి ఫోటోలు అందిస్తూ ఇచ్చింది తీసుకుంటూ కాలమెల్లదిస్తున్న క్రమంలో అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మృత్యువాత పడ్డారు. ఎవరో వచ్చి ఆదుకుంటారన్న క్రమంలో రాష్ట్ర ఫోటోగ్రావర్ల సంఘం మెదక్ జిల్లా ఫోటో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వారి కుటుంబానికి ఒక లక్ష 8 వేల రూపాయల చెక్కును అందజేయడం జరిగిందని మెదక్ జిల్లా ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ వెల్దుర్తి మండల ఫోటోగ్రాఫర్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ఆంజనేయులు ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు



పంబాల వృత్తి కళాకారుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు నల్ల పోచమ్మ దేవాలయంలో పూజారి వృత్తి నిర్వహిస్తున్న పంబాల పూజారుల సమస్యలు పరిష్కరించాలని దేవాలయ కమిటీ చైర్మన్ కోల మహేందర్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాతల ముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చిన పంబాల కుల వృత్తిని నమ్ముకుని అమ్మవారి దేవాలయంలో పట్నాలు వేసే వృత్తిని నిర్వహిస్తున్న మాకు ఎలాంటి జీవనాధారం లేదన్నారు. గత పది సంవత్సరాల క్రింద నిర్ణయించిన కట్నమే ఇప్పటికీ ఇవ్వడం వల్ల పెరిగిన ధరలకు అనుగుణంగా జీవన భృతి కొనసాగించలేక పోతున్నామన్నారు. పట్నం కట్నాన్ని ఐదు వేల రూపాయలుగా నిర్ణయించి పంబాల వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జప శ్రీకాంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు జైపాల్ రెడ్డి, కోల రమేష్ గౌడ్, ఆలయ సూపర్వైజర్ రాజిరెడ్డి, పంబాల సంఘం ప్రతినిధులు సుద్దాల సుదర్శన్, సుద్దాల రంజిత్ కుమార్, సుద్దాల రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

లక్కమారి రెడ్డి కుల సంఘం గ్రామ అధ్యక్షుడిగా నర్సిరెడ్డి



నవతెలంగాణ-చేర్యాల : మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలో లక్కమారి రెడ్డి కుల సంఘ సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనుముల నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులుగా గోద లింగం కోశాధికారిగా ఖార్జురి తిరుపతి,సంయుక్త కార్యదర్శి గా పుల్లయ్య, సలహాదారు లుగా ఆరె బాల లింగం,గూడు రామచంద్రం,కడుదూరి నర్సిరెడ్డి, అనుముల రవిని ఎన్నుకున్నారు.

నారీ ప్రభాత భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

జెడ్పీటీసీ కనగండ్ల కవిత



నవతెలంగాణ-బెజ్జంకి

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీ రాంలీల మైదానంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించంచే అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జెడ్పీటీసీ కవిత కోరారు. సోమవారం నిర్వహించనున్న నారీ ప్రభాత బేరీ కార్యక్రమానికి మండలంలోని మహిళలు పెద్ద సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని జెడ్పీటీసీ కనగండ్ల కవిత అదివారం కోరారు. నారీ ప్రభాత బేరీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్సీ కల్వకుంట్ల కవిత,సత్యవతి రాథోడ్ హజరవుతున్నారని తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-నంగునూరు : నంగునూరు మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మంజూరైన రూ.60 లక్షల విలువ చేసే సీసీ రోడ్డు పనులను మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. నంగునూరు గ్రామ సర్పంచ్ చౌడుచెర్ల మమత జయపాల్ రెడ్డి మాట్లాడుతూ ఇంకా మిగిలి ఉన్న సిసి రోడ్డు, డ్రైనేజీ పనులు అతి త్వరలోనే మంత్రి హరీశ్‌రావు సహకారంతో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంగునూరు ఎంపీటీసీ కోల సునిత మహేందర్ గౌడ్, సొసైటీ చైర్మన్ కోల రమేష్ గౌడ్, సిద్దన్నపేట ఎంపీటీసీ బెదురు తిరుపతి,మార్కెట్ కమిటీ మార్కెట్ డైరెక్టర్ రేకులపల్లి వెంకట్ రెడ్డి, టీఆర్ఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కనకయ్య, వార్డు సభ్యులు గాడి పల్లి రాజేందర్ రెడ్డి, గోటూరు రాజిరెడ్డి, పందిళ్ళ జయపాల్ రెడ్డి, దేవులపల్లి గణేష్, తుమ్మకోలు మాధవి రవీందర్ రెడ్డి,నాయకులు సిరికొండ రామచంద్రం, చింతల శ్రీనివాస్ రెడ్డి, చింతల దుర్గారెడ్డి, కల్లూరి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కూరెళ్ళకు బీటి రోడ్డు మంజూరి పట్ల హర్షం



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని కూరెళ్ళ గ్రామం మీదుగా తంగళ్ళపల్లి ఎక్స్ రోడ్ వరకు బీటి రోడ్డుకు మంజూరి కావడం పట్ల గ్రామ సర్పంచ్ గాజుల రమేష్, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ గ్రామానికి బీటీ రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ చొరవతో మంత్రి హరీశ్‌రావు వెంటనే స్పందించి బీటి రోడ్డు మంజూరికి ప్రొసిడింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అలాగా బీటి రోడ్డు మంజూరికి సహకరించిన రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, ఎంపీపీ కొక్కుల కీర్తిసురేష్, జెడ్పీటీసీ నాగరాజు శ్యామల మధుసూదన్‌రావు, ప్యాక్స్ ఛైర్మన్ పెర్యాల దెవేందర్‌రావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు పెర్యాల నవ్యదెవేందర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు ఉన్నత పాఠశాలలో 1982-83 సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు చదువుకున్న పాఠశాలలో గురువులతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఒకరినొకరు, ఆత్మీయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఏ రంగంలో, ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్న జన్మనిచ్చిన తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, మాతృభూమిని మర్చిపోవద్దని సమాజానికి సేవ చేసే విధంగా కృషి చేయాలన్నారు. తాము నేర్పిన విద్యాబుద్ధులతో వివిధ స్థాయిలకు ఎదగడం పట్ల తమకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు జీ. నరసింహ్మ స్వామి, ఆర్. రామచంద్రా రెడ్డి,ఈ. రామచంద్రా రెడ్డి, సంజీవ రెడ్డి, రాములు,పూర్వ విద్యార్థులు ప్రస్తుత మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త చెలిమిల్ల బాలమల్లయ్య, న్యాయవాది తుంగ కనకయ్య, శనిగరం కనకయ్య,జాజంరాజు వేణుగోపాల్ రావు, వర్కోలు లక్ష్మయ్య, ఆర్. గోపాల్, ప్రసాద్ రెడ్డి,అరుణ ,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఉపాధ్యాయులను మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రతిరోజూ పది నిమిషాలు ధ్యానం చేయాలి

మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల



నవ తెలంగాణ-సిద్దిపేట

ప్రతిరోజు ఉదయాన్నే పది నిమిషాలు ధ్యానం చేయాలని, పారిశుద్ధ్య కార్మికులు యోగా చేస్తే ఆరోగ్యంగా ఉంటారని మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు అన్నారు. ఆదివారం పురపాలక సంఘం లో పారిశుద్ధ్య కార్మికులచే పది నిమిషాలు ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ సంపత్ కుమార్‌తో కలసి ఆమె మాట్లాడుతూ మంత్రి హరీశ్ రావు కార్మికుల కొరకు నిరంతరం ఆలోచిస్తారని, వారి ఆదేశాల మేరకు మున్సిపల్ కార్మికులు ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ సైతం చేపించామన్నారు. ప్రతిరోజూ పది నిమిషాలు ధ్యానం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, నిత్యం పట్టణ పరిశుభ్రతకు పాటుపడే వారి మనస్సు ఆందోళన నుంచి విముక్తి పొందేలా, ప్రశాంతత, శాంతి ధ్యానం వల్ల కలుగుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం కార్మికులచే పది నిమిషాలు ధ్యానం చేపించాలని సానిటరీ ఇన్స్పెక్టర్ లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రబోద్ అచ్యుత (గుడాకేష గ్రాండ్ మాస్టర్), మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న కోరుట్ల ఎమ్మెల్యే



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండలం పరిధిలోని తిగుల్ నర్సాపూర్ గ్రామంలో గల శ్రీ కొండపోచమ్మ అమ్మవారిని ఆదివారం కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఒడి బియ్యం పోసి సల్లంగా దీవించు తల్లి అంటూ మొక్కుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజలు పార్టీ కార్యకర్తలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. కేంద్రంలో బీఆరెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా దీవించుమని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏఎంసి వైస్ చైర్మన్ ఉపేందర్ రెడ్డి నాయకులు గణేష్, సిబ్బంది వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

మర్కుక్‌లో ఉచిత వైద్య శిబిరం

కొత్త మీరా బాయి హాస్పిటల్ గజ్వేల్ వారి సౌజన్యంతో



నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ గ్రామంలో కొత్త మీరా బాయి హాస్పిటల్ గజ్వేల్ వారి సౌజన్యంతో డాక్టర్. కొత్త ప్రేమ్ కిషోర్ , డాక్టర్. కొత్త రచనల ఆధ్వర్యంలో ఉచిత వైద్యం శిబిరాన్ని మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్‌తో కలసి ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు బిపి,షుగర్,తదితర వైద్య పరీక్షలు నిర్వహించి,కావాల్సిన మందులను పంపిణీ చేశారు. ఈ శిభిరంలో ప్రజలు ఆదిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కొత్త మీరాబాయి హాస్పిటల్ యజమాన్యం కొత్త శ్యామ్ సుందర్, కొత్త నందకిషోర్, గ్రామస్తులు, తదితరులున్నారు.

ఇంటింటి ప్రచారంలో తెలుగుదేశం పార్టీ



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని ఆదివారం హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని సుందరగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇంటింటి తెలుగుదేశం ప్రచారం కార్యక్రమానికి విద్యార్థి విభాగ రాష్ట్ర కో ఆర్డినేటర్ పర్లపల్లి రవీందర్,రాష్ట్ర నాయకులు దామెర సత్యంలు పాల్గొని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు జాతి ఉన్నత కాలం తెలుగుదేశం పార్టీ ఉంటుందని అన్నారు. అనేక సంక్షేమ అభివృద్ధి పథకాల ద్వారా తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు పెంచిందన్నారు. నియోజవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్ళి తెలుగుదేశం పార్టీ చేసిన అభివృధి, సంక్షేమాన్ని ప్రచారం చేసి, ప్రజలలో చైతన్యం తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ బత్తుల శ్రీనివాస్, రాష్ట్ర దళిత నాయకులు చింతకింది సింగరి,హుస్నాబాద్ మండల కో ఆర్డినేటర్ మామిడి తిరుపతి,పట్టణ కో ఆర్డినేటర్ వరయోగుల శ్రీనివాస్, చిగురుమామిడి కో ఆర్డినేటర్ సంతోష్, సైదాపూర్ కో ఆర్డినేటర్ కంది రమణారెడ్డి,భిమదేవరపల్లి కో ఆర్డినేటర్ శంకర్, సీనియర్ నాయకులు బత్తుల శంకర్,కుమార్, ఆంజనేయులు,షారుఖ్,ఆకుల వెంకటేష్, హసన్, పిట్టల సమ్మయ్య,జైపాల్ తదితరుల పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



నవతెలంగాణ-కోహెడ

తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని పరివేద గ్రామానికి చెందిన రడపు శ్రీనివాస్‌ను నియామకం చేసినట్లు జిల్లా అధ్యక్షుడు బెక్కంటి సంపత్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను లబ్దిదారులకు చెరేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆడపిల్లలుగా పుట్టడమే శాపమా

- ప్రాజెక్టుకు మేము అడ్డు కాదు
- పెళ్లయిన మాకు పరిహారం ఇవ్వాలి
- దొంగల్లాగా పనులు ఎందుకు చేస్తున్నారు
- నిరసన దీక్షకు పూనుకున్న నిర్వాసితులు

నవతెలంగాణ-అక్కన్నపేట

తరతరాల తాతలు, తండ్రుల నుంచి ఎవుసం చేసుకుంటూ ఈ భూమి పైనే ఆధారపడి బతికి, వారి సర్వస్వం బతుకుదెరువైన ఆ భూమిని, ఇండ్లను వదిలిపెట్టి పొమ్మంటే ఎలా ఉంటుందో, గుడాటిపల్లి నిర్వాసితులను కన్నీరు చూస్తే అర్థమవుతుంది. అక్కడ ఏ తల్లిని కదిలించినా, ఏ అయ్యను మందలించినా కన్నీరు తప్ప మరేం కనబడడం లేదు. అయినా మేము రైతు బిడ్డలం కాబట్టి, ఈ మెట్ట ప్రాంతానికి గంగమ్మ తల్లి రావాలని, భూమిని త్యాగం చేస్తే లక్షలాది ఎకరాలకు నీరంది లక్షలాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని వందల ఏళ్ల నుంచి బ్రతుకుతెరువుగా ఉన్న భూమిని, ఇండ్లను ప్రాజెక్టు కోసం త్యాగం చేశారు. గవర్నమెంట్ ఇచ్చిన పావులా, పరక పరిహారానికి సర్వస్వాన్ని కోల్పోయారు.. సర్కారు ఇచ్చే డబ్బుతో ఇల్లు కట్టుకుంటే, భూమి లేకపాయే, భూమి ఉంటే ఇల్లు లేకపాయె.. వారిచ్చే పరిహారం ఈ మూలన సరిపోకపాయే..అయినా ఓర్చుకొని ప్రాజెక్టు పనులకు సహకరించారు.. అయినా వారిపై ప్రభుత్వం కన్నెర్ర జేస్తోంది. వారికి న్యాయంగా ఇచ్చే పరిహారమైన చెల్లిస్తే ఈనాటికి ప్రాజెక్టు కంప్లీట్ అయ్యేది. కానీ వారికి ఇవ్వాల్సిన పరిహారాలు ఇవ్వకుండా, కాలయాపన చేస్తూ ప్రాజెక్టును 14 సంవత్సరాలాల నుంచి నిర్మిస్తూనే ఉన్నారు. కడుపు నిండినోళ్లకు బువ్వ పెట్టినట్టు, పైరవీలు చేసే వారికి డబ్బులు ఇచ్చి ఏమీ తెలియని నిరుపేదలను అన్యాయం చేస్తున్నారు. పెళ్లయిన ఆడబిడ్డలకు ప్యాకేజీ చెల్లించకుండా పోలీసు పహారాను పెట్టి వాళ్ల రక్తాన్ని కళ్లజూసి గండి పనులు మొదలుపెట్టిన ఈ ప్రభుత్వ తీరు చూస్తే ఆడపిల్ల అయినా ఆ గంగమ్మ తల్లి కూడా సిగ్గుపడుతుంది. ఆడపిల్లలకు అన్నింట్లో సమానమైన హక్కు అని చెబుతూ, ఈ నిర్వాసిత ఆడపిల్లలకు అన్యాయం చేయడం ఇక్కడి ప్రాంత నాయకులకు, అధికారులకు న్యాయం కాదు. ఎద్దేడిసిన ఎవుసం, ఆడపిల్ల కన్నీరు పెట్టిన పని ఏనాడు సాగినట్టు చరిత్రలో లేదు. అలాంటి ఆడ తల్లులకు న్యాయమైన పరిహారం ఇవ్వకుండా ఈ ప్రభుత్వం లాటి తూటాలతో అణచివేస్తూ కన్నీరు కారుస్తున్న ఆడపిల్లల బతుకులను రోడ్డున పడేయడం న్యాయమా. మరి వారికి రావలసిన పరిహారం ఏంటి. ఆడపిల్లలు నిరసన దీక్షకు ఎందుకు పూనుకున్నారు. అనే వివరాలు పూర్తిగా చూద్దాం...

2007లో ప్రాజెక్టుకు పునాది

కరువు ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గ దాహార్తి తీర్చాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి 2007లో గౌరవెల్లి ప్రాజెక్టుకు 1.40 టీఎంసీల సామర్థ్యంతో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత సగం కట్ట పనులు పూర్తయిపోయాయి. దీని తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ ప్రాజెక్టును రీ డిజైనింగ్ పేరుతో దాదాపు 8 టీఎంసీలకు సామర్థ్యాన్ని పెంచేశారు. దీంతో దాదాపు 3900 ఎకరాలు రైతులు భూములు కోల్పోవాల్సి వచ్చింది. అంతేకాకుండా కొన్ని గిరిజన తండాలు కూడా ఈ ముంపునకు గురయ్యాయి. అప్పటి నుంచి పనులు నత్త నడకన సాగుతూ వస్తున్నాయి. మళ్లీ 2022లో ప్రాజెక్టు ఎలాగైనా పూర్తి చేయాలనే సంకల్పంతో పనుల్లో వేగవంతం పెంచారు. 18 సంవత్సరాలు నిండిన కొంతమంది యువతీ, యువకులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ ఇచ్చేశారు. కానీ ఇందులో పెళ్లైనటువంటి వందమందికి పైగా అమ్మాయిల పేర్లను ముందుగా లీస్టులో నమోదు చేసి, ఆ తర్వాత పెళ్లయిందని నెపంతో లీస్టు నుంచి తొలగించారు. దీంతో వివాహిత మహిళలు గత మూడు నెలలుగా అధికారులు, ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతున్నారు. అయినా వారు స్పందించకపోవడంతో దీక్షా శిబిరాన్ని ఏర్పాటు



చేసుకొని మూడు నెలలకు పైగా దీక్ష చేస్తూనే ఉన్నారు. అయినా అధికారులు ఎవరు వారి గోడును పట్టించుకోలేదు. ఓవైపు దీక్ష చేస్తుంటే మరోవైపు హుస్నాబాద్ -గండిపల్లి మధ్యలో ఉన్న గండిని మూసి వేశారు. తర్వాత శుక్రవారం అర్ధరాత్రి పోలీస్ పహారా మధ్య హుస్నాబాద్ నుంచి రామవరం వెళ్లే దారిలో ఉండే రెండవ గండి పనులు మొదలుపెట్టారు. గుడాటిపల్లి గ్రామం మొత్తం పోలీసులు నిండుకొని ఇంటికో ఇద్దరు చొప్పున ఉండి ఏ ఒక్కరిని బయటకు రానివ్వకుండా రాత్రికి రాత్రే ఆ గండి పనులు మొదలుపెట్టడంతో నిర్వాసితులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వారికి వచ్చే మంచినీటి సరఫరాను కూడా నిలిపివేసి పనులు నడిపిస్తున్నారు. దీంతో శనివారం ఉదయం పెళ్లయిన నిర్వాసితులు, ఇండ్ల పరిహారం రాని మరికొంతమంది నిర్వాసితులు కలిసి రోడ్డుపై నిరసన దీక్షలో కూర్చున్నారు. వారికి రావలసిన న్యాయమైన పరిహారాన్ని ఇవ్వాలని, లేదంటే ఇక్కడి నుంచి కదిలేది లేదని పట్టుబట్టారు. దీంతో పోలీసులంతా ఒక్కసారిగా వారిపై ముకుమ్మడిగా దాడి చేసి అక్కడి నుంచి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ దాడిలో కొంతమంది నిర్వాసితులకు గాయాలు కూడా అయ్యాయి.

కొట్టుకుంటూ అరెస్టు చేశారు

గత మూడు నెలలుగా మా ప్యాకేజీ ఇవ్వాలని టెంట్ వేసుకుని నిరసన చేస్తున్నాం. ఇప్పుడు ఇస్తాం, అప్పుడు ఇస్తామంటూ ఒక గండి మూసిన్రు. శుక్రవారం అర్ధరాత్రి పోలీసుల పహారా మధ్య మరో గండి పనులు మొదలుపెట్టిన్రు. మాకు డబ్బులు ఇవ్వాలని మేము నిరసన దీక్ష కూర్చుంటే కొట్టుకుంటూ అరెస్టు చేశారు. ఈ క్రమంలో నా చేతికి గాయమై కుట్లు పడ్డాయి.



పెండ్యాల సౌజన్య, గుడాటిపల్లి నిర్వాసితురాలు.

ఆడపిల్లలం అయినందుకే పరిహారం ఇస్తలేరు:



మా ఇంట్లో మేము ముగ్గురం ఆడపిల్లలం. డ్యాములో భూమి పోతోందని ఇల్లున్నప్పుడే మా అమ్మ నాన్న తొందరగా పెళ్లి చేశారు. నాకు 18 సంవత్సరాలు నిండాయి. ముందుగా లిస్టులో నా పేరు వచ్చింది. పెళ్లయిందని లిస్ట్ నుంచి పేరు తొలగించారు. మా ఇంట్లో ముగ్గురం ఆడపిల్లలం మా పరిస్థితి ఏంటి ఎమ్మెల్యే సారు.

బైరి సౌజన్య , పెళ్లయిన నిర్వాసితురాలు

పరిహారం ఇచ్చేదాకా కదిలేది లేదు



పెళ్లయిన ఆడపిల్లలకు పరిహారం ఇచ్చేవరకు ఇక్కడి నుంచి కదలం. కనీసం నీళ్లు లేకుండా చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. న్యాయమైన డిమాండ్లు నెరవేరిస్తే మేమెందుకు అడ్డుకుంటాం.

బద్దం రాజిరెడ్డి, గూడాటిపల్లి సర్పంచ్

మే చివరి వారంలో అర్బన్ పార్క్ కాటేజీల ఏర్పాటు

సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

నవ తెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ అర్బన్ పార్కులో గల కాటేజీలకు మరమ్మత్తు నిర్వహించి మే చివరిలోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఫారెస్ట్ అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ గజ్వేల్ అర్బన్ పార్క్‌ను సందర్శించి వాకింగ్ ట్రాక్, వాచ్ టవర్, కాటేజీలు, అర్బన్ పార్కులో సందర్శకులను ఆకర్షించడం కోసం మార్నింగ్ వాకర్స్ కోసం ఏర్పాటుచేసిన సౌకర్యాలు తనిఖీ చేశారు. రెండు కోట్ల రూపాయల రూర్బన్ మిషన్ నిధులతో పార్కులో ఏర్పాటుచేసిన 12 కాటేజీలను పరిశీలించి ఇప్పటికీ కోటి 50 లక్షల రూపాయలు వ్యయం చేసి నిర్మించిన కాటేజీలను, మరో 50 లక్షల రూపాయలు ఖర్చు చేసి మరమ్మత్తు, ఫర్నిచర్ ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి మే నెల చివరి వరకు సందర్శకులకు అందించేలా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా సందర్శకులను అధిక సంఖ్యలో ఆకర్షించేలా పార్కులో గల విశేషాలపై రాజీవ్ రహదారి వెంబడి ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతిరోజు స్థానిక



ప్రజలు సందర్శించేలా ప్రచారం చేయడంతో పాటు మార్నింగ్, ఈవెనింగ్ వాకర్స్ కోసం వసతులు కల్పించాలని, సైక్లింగ్ కోసం ప్రత్యేక సైకిళ్లను ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాలని అన్నారు. అనంతరం కొండపాక మండలం లకుడారం బీటులోని మల్లన్న వనం అటవీ ప్రాంతంలో 10 కిలోమీటర్లకు పైగా మల్లన్న సాగర్ వ్యూ పాయింట్ వరకు నూతనంగా వేస్తున్న మట్టి రోడ్డుపై ప్రయాణించి రోడ్ ఏర్పాటు 2 నెలలలోగా పూర్తి చేయాలని, వ్యూ పాయింట్ వద్ద వాచ్ టవర్ ను ఏర్పాటు చేయాలని జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్ ను ఆదేశించారు. ఈ పర్యటనలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కిరణ్ కుమార్, ఫారెస్ట్ సెక్షన్ మరియు బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ పట్టణంలోని కోట మైసమ్మ రోడ్డు వెంటనే నిర్మించాలి

సీపీఐ (ఎం) మండల కార్యదర్శి సందీటి రంగారెడ్డి



నవ తెలంగాణ-గజ్వేల్ : గజ్వేల్ పట్టణంలో ఇంద్ర పార్క్ నుండి కోట మైసమ్మ వరకు వెళ్ళు రోడ్డును వెంటనే పూర్తి చేయాలని సీపీఐ (ఎం) మండల కార్యదర్శి సందీటీ రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా పనులు ప్రారంభించి ఇంత వరకు పూర్తి చేయడం లేదన్నారు. రోడ్డుకిరువైపులా ఉన్న బిల్డింగ్‌లను కూల్చివేసి రెండు సంవత్సరాలు కావస్తున్నా పనులు మాత్రం వేగవంతం కావడం లేదన్నారు. కోట మైసమ్మ వరకు వెళ్లే గజ్వేల్ పట్టణవాసులు బయట గ్రామాల వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ప్రధాన మార్కెట్ ఈ రోడ్డులో ఉండడం వల్ల నిత్యం షాపులకు వచ్చే ప్రజలు, నిత్యం రోజు వచ్చి పోయేవారు గొంతులోకి, ముక్కులోకి దుమ్ము ధూళితో రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో కిలోమీటర్ రోడ్డు కూడా రెండున్నర సంవత్సరాలుగా పనులు సాగుతున్నాయంటే విచిత్రంగా ఉందన్నారు. అధికారులు ఏ స్థాయిలో పనిచేస్తున్నారో అర్థమవుతుందని ఆయన మండిపడ్డారు. గజ్వేల్‌కు ప్రత్యేక అధికారి ఎందుకు నియమించారో తెలియడం లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గ కేంద్రంలోని ఓ పక్క డబుల్ బెడ్ రూమ్, మరో పక్క ఇంద్ర పార్క్ కోట మైసమ్మ రోడ్డు రెండున్నర సంవత్సరాలుగా చర్చలు జరుగుతున్న ప్రత్యేక అధికారి ఎందుకు పట్టించుకోవడంలేదని ఆయన ప్రశ్నించారు. రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయి నా వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇండ్ల కేటా యింపులో ఎంత శాతం ఇల్లు పోతుందని అవసరం లేదని రోడ్డు నిర్మాణంలో గజం జాగపోయినా విలువైందని స్పెషల్ అధికారి తెలుసుకోవాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ జాబితాలో ప్రత్యేక దృష్టి ప్రతి వార్డులో లబ్ధిదారుల అభిప్రా యాల బాక్స్ ఏర్పాటు చేస్తే ఆ వార్డులోని నిరుపేదలను గుర్తించవచ్చని ఆయన పేర్కొన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని మొత్తం 20 వార్డుల్లో రెండు రోజులపాటు వార్డు కార్యాలయం వద్ద ఆ వార్డులో వచ్చిన లబ్దిదారుల లిస్టు అతికించి ఇందులో ఎవరికి ఇల్లు ఉంది లే అనే సమస్యను ఆ బాక్సులు వేస్తే సరిపోతుంది అని ఆయన చెప్పారు. ఆ దిశగా కొంత ప్రయత్నం చేయాలని ఆయన కోరారు. ఈ రోడ్డును వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రజల సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కొమురవెల్లి మల్లన్న స్వరూపం సీఎం కేసీఆర్

- యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ప్రజలు కోరిన కోరికలు తీర్చే కొమురవెల్లి మల్లన్న స్వామి స్వరూపంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని పశు సంవర్ధక, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ ఎస్ ఫోర్ కాన్వెంక్షన్ హాల్‌లో నిర్వహించిన యాదవ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలకు దైవ స్వరూపంగా పరిపాలిస్తు న్నారన్నారు. యాదవుల కులవృత్తి గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించి, ఎక్కడా లేని విధంగా రూ.11 వేల కోట్ల వ్యయంతో 75 శాతం సబ్సిడీపై గొర్రెల యూనిట్ల పంపిణీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కొమురవెల్లి మల్లన్న ఆలయం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రజల బాగోగులు పట్టించుకొనే మన అభివృద్ధికి బాటలు వేసే ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. మాయ మాటలు చెప్పే వారిని కాకుండాచేతల ప్రభుత్వానికి మద్దతు తెలపాల న్నారు. హైదరాబాద్ నగరానికే పరిమితమైన సదర్ ను రాష్ట్ర పండుగ గా నిర్వహిస్తున్న ప్రభుత్వం తెలంగాణ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, షీప్ ఫెడరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసితులచే కంటతడి పెట్టియ్యవద్దు

- మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

గౌరవెల్లి భూనిర్వాసితులకు న్యాయం చేస్తూ ప్రాజెక్టు పూర్తి చేయాలని, నిర్వాసితులచే కంటతడి పెట్టియ్యవద్దని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లో సీపీఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్ట్ పోలీస్ పహారాలో పనులు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. నిర్వాసితులకు అన్ని రకాల బెనిఫిట్స్ చెల్లించాలని, ఆడబిడ్డలకు రావలసిన ప్యాకేజ్ ఇవ్వాలన్నారు. బీజేపీ నాయకులు సీపీఐ, కాంగ్రెస్ , బీఆర్ఎస్ ఒకటేనని అనడం అర్థరహితమన్నారు. హుస్నాబాద్ పట్టణంలో కేటాయించిన డబుల్ బెడ్ రూమ్‌ల ఎంపికలో అర్హులకు చోటు కల్పించాలన్నారు. అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేసి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంద పవన్, సంపత్, గడిపె మల్లేష్, సుదర్శన చారి, మడిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

20న లక్ష మందితో మంత్రి కేటీఆర్ సభ

నిర్వాసితులకు అన్యాయం జరిగిందని నిరూపిస్తే దేనికైనా సిద్ధం

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్‌లో ఈ నెల 20న ఐటీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన ఉంటుందని, లక్ష మందితో సభ నిర్వహించనున్నట్లు హుస్నాబాద్ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో రూ. 20 కోట్లతో బీటీ రోడ్లు మంజూరు చేశామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశామన్నారు. గౌరవెల్లి భూనిర్వాసితులకు అన్యాయం జరిగిందని నిరూపిస్తే దేనికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. 8 టీఎంసీల గౌరవెల్లి ప్రాజెక్టును నిర్మించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్ళు నింపుతామని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి కావడంతో ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. పూర్తయిన గౌరవెల్లి ప్రాజెక్టు గురించి మాట్లాడకుండా 5 టీఎంసీ సామర్థ్యం కలిగిన గండిపల్లి ప్రాజెక్టు గురించి మాట్లాడుతున్నారన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజితవెంకన్న ఎంపీపీలు లగావత్ మానస, మాలోతు లక్ష్మీ బీలు నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్, మార్కెట్ చైర్మన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

హుస్నాబాద్ లో అన్ని విధాల అభివృద్ధికి కృషి

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్ : హుస్నాబాద్ నియోజకవర్గాలు అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని హుస్నాబాద్ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ అన్నారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో కోటి రూపాయలతో నిర్మించే షెడ్డు నిర్మాణం, హుస్నాబాద్ పట్టణం 14వ వార్డులో రూ. 20 లక్షలతో నిర్మించే సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, మార్కెట్ చైర్మన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి, హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస, జెడ్పీటిసి భూక్య మంగా శ్రీనివాస్, అక్కన్నపేట ఎంపీపీ మాలోతు లక్ష్మీ భిల్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్, కౌన్సిలర్లు భాగ్యరెడ్డి, బొజు రమాదేవి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరపల్లి పొదుపు సంఘం అధ్యక్షుడిగా రాజ్‌కుమార్



నవతెలంగాణ-కోహెడ : మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా వరుసగా మూడవసారి తోట రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం 22వ మహాసభ కార్యక్రమం అనంతరం నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. తన నియామకానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దానబోయిన రాజు, పాలకవర్గ సభ్యులు గుజ్జ శ్రీనివాస్‌రెడ్డి, దానబోయిన శ్రీనివాస్, తూటి సంజీవరెడ్డి, ఇనుగాల అంజిరెడ్డి, చింతల సంపత్‌రెడ్డి, ముడికె శ్రీనివాస్, కంది సత్యనారాయణ రెడ్డి, సీసీపల్లి అధ్యక్షుడు భీంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, సంఘ సభ్యులు హాజరయ్యారు.

మంత్రి, ఎంపీ సహకారంతోనే డయాలసిస్ కేంద్రం



నవ తెలంగాణ-దుబ్బాక

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక,వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతోనే దుబ్బాక ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని 16వ వార్డు కౌన్సిలర్ దేవుని లలిత చంద్రయ్య తెలిపారు. ఆదివారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని 16 వ వార్డులో ఆమె మాట్లాడారు. దూర ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేసుకుంటున్న దుబ్బాక ప్రాంత కిడ్నీ పేషంట్లకు మంత్రి హరీష్‌రావు డయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మంత్రి హరీశ్ రావు, ఎంపీ ప్రభాకర్ రెడ్డిలకు 16వ వార్డు కౌన్సిలర్ దేవుని లలిత చంద్రయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

స్వేరో నంగునూరు మండల అధ్యక్షుడు దేవులపల్లి రమేశ్



నవతెలంగాణ-నంగునూరు

రాష్ట్రంలోని సాంఘిక, గిరిజన, బీసీ, సాధారణ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో 5వ తరగతిలో ప్రవేశ దరఖాస్తుల గడువు సోమవారంతో ముగియనున్నందన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్వేరో ఇంటర్నేషనల్ నంగునూరు మండలం అధ్యక్షుడు దేవులపల్లి రమేష్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు అభివృద్ధి చెందిన ఇతర వర్గాల పిల్లలతో సమానంగా నాణ్యమైన విద్యను అందిస్తూ వారితో సహజసిద్ధమైన నైపుణ్యాలను వెలికితీస్తుందన్నారు. ఈ లక్ష్యంతో, యస్సీ, యస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలను సంక్షేమ శాఖ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నెలకొల్పిందన్నారు. ఇంగ్లీష్ మీడియంలో విజయవంతంగా నడుస్తున్న ఈ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశంకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మన గురుకులాలు విద్యార్థుల ప్రగతికి సోపానాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న తెలంగాణవ్యాప్తంగా నిర్దేశించిన కేంద్రాల్లో నిర్వహిస్తారని తెలిపారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి



నవ తెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన కొండం అశోక్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, వారి కుటుంబాన్ని మంత్రి హరీశ్ రావు పరామర్శించారు. వారి కుటుంబీకులలో మనోధైర్యాన్ని నింపారు. పారుపల్లి వీధిలోని ప్రముఖ వ్యాపారవేత్త కన్యాలాల్ బజాజ్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. వారి కుటుంబాన్ని మంత్రి హరీశ్ రావు పరామర్శించారు.

మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శ

నవతెలంగాణ-కోహెడ



మండల కేంద్రానికి చెందిన బస్వరాజు లస్మయ్య ఇటీవల మరణించగా ఆయన కుటుంబ సభ్యులను బొమ్మ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరామర్శించి, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, వార్డు సభ్యులు బండ జగన్, బొమ్మగాని శివకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు రామంచ రాంచంద్రారెడ్డి, గాజుల వెంకటేశ్వర్లు, సింగిరెడ్డి పవన్‌రెడ్డి, ఉత్తునూరి శ్రీకాంత్, ముంజ సాగర్, పొన్నాల సురేష్‌లు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం ఖాతా గ్రామంలో అనారోగ్యం తో మాదిరెడ్డి రాజేందర్ రెడ్డి మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న రెడ్డి సంఘం అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు దారం భగవాన్ రెడ్డి,రెడ్డి సంఘం సభ్యులు, గ్రామ సర్పంచ్ చల్ల దశమంత రెడ్డి రెడ్డి సంఘం తరపున ఐదు వేల రూపాయల అర్థిక సహాయాన్ని అందించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల పరిదిలోని ధర్మారం గ్రామంలో కుటుంబ పెద్దను కోల్పోయి దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న నిరుపేద కుటుంబానికి అండగా విద్యుత్ శాఖ నిలిచింది. గ్రామానికి చెందిన గజాం శ్రవణ్‌కు భార్య పిల్లలు ఉన్నారు. సంవత్సరం క్రితం విద్యుత్ షాక్‌తో శ్రవణ్ మృతి చెందిన విషయం తెలిసిందే. కుటుంబ పెద్దదిక్కు కోల్పోయిన ఆ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరువున స్థానిక సర్పంచ్ రాజు, ఆత్మ కమిటీ డైరెక్టర్ జుర్రు ఐలయ్య గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు అదివారం చెక్కును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాగైనా ఆ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందేలా చూడాలని ఆలోచనతోనే కష్టపడి విద్యుత్ శాఖ ద్వారా రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు సర్పంచ్ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం కృషితో 19 వార్డు అభివృద్ధికి కృషి

నవ తెలంగాణ-గజ్వేల్



ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు నేతృతంలో గజ్వేల్ మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుం దని మున్సిపల్ పరిధిలోని 19వ వార్డు కౌన్సిలర్ గుంటుక శిరీష రాజు అన్నారు. ఆదివారం వార్డులో సీసీ రోడ్లు కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, పట్టణంలో అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఏ లక్ష్యం ముందుకు ముందుకు వెళ్తన్నారో అదే లక్ష్యంతో తాము ముందుకు వెళ్తున్నామని ఆమె చెప్పారు. మంత్రి హరీశ్‌రావు వార్డుపై ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు మంజూరు చేశారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నవాజ్, పులి బాలచంద్రం, సాయి, అనసూయ, గుంటుక శాంతి, భాగ్య, సంధ్య, నరసింహారెడ్డి, ఆశ, సుధాకర్, గోపి, భాగ్య, శ్రావణ్, తలారి వెంకటి, అంజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నహస్త మిత్ర బృందం ఆర్థిక సాయం

నవ తెలంగాణ- దౌల్తాబాద్ : మండల కేంద్రమైన గ్రామానికి చెందిన గొల్ల లింగం గత కొన్ని కొన్ని సంవత్సరాలుగా సోరియాసిస్, కిడ్నీ, లివర్ ,సంభదిత వ్యాదులతో బాధపడుతున్న విషయం తెలిసిందే ఆదివారం గజ్వేల్ పట్టణంలో అప్పన్నహస్త మిత్ర బృందం బాధిత కుటుంబానికి నెలకు సరిపడా 5000 కిరాణా సామాగ్రి 15000 నగదు రూపాయలు అందజేయడం జరిగింది. అనంతరం స్థానిక విలేకరుల సమావేశంలో అపన హస్త మిత్ర అధ్యక్షుడు పాసికంటి బాలచంద్రం మాట్లాడుతూ లింగం కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కొలిచెల్మే స్వామీ సభ్యులు, సంజీవ రెడ్డి, సత్యనారాయణ, కృష్ణ , స్వామి బాల్ శేఖర్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు .

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

గిరిజనుల ఆరోగ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజు అని ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయం వద్ద శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 284 వ జన్మదినాన్ని ఎంపీపీ లకావత్ మానస సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జన్మదిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీష్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో



హనుమకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్ బాబు, జెడ్పిటిసి భూక్యమంగా శ్రీనివాస్, హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస సుభాష్, అక్కలపేట ఎంపీపీ మాలోతు లక్ష్మీ బీలు నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాస మహర్షి యోగ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి స్నానం

నవ తెలంగాణ - సిద్దిపేట

వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో మట్టి స్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యాసమహర్షి యోగా సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మా సంస్థ యొక్క ఆధ్వర్యంలో అనేక రకాల ఉచిత యోగా శిక్షణ శిబిరాలు, ఆరోగ్యానికి మెరుగుపరచుకోవడం కోసం వినూత్న పద్ధతులను పరిచయం చేశామనీ, అందులో భాగంగా ఈరోజు మొదటిసారిగా మట్టి స్నానం నిర్వహించామని తెలిపారు. యోగ శిక్షకులు తోట సతీష్ మాట్లాడుతూ మట్టి స్నానం కోసం ముందుగానే ప్రత్యేకమైనటువంటి మట్టిలో దాదాపు 20 రకాల ఔషధాలను కలపడం జరుగుతుందనీ, వీటిని



శరీరానికి లేపనంగా రాస్తాము ఆ తర్వాత ఒక గంట సమయం తర్వాత స్నానం చేయవలసి ఉంటుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్ ,చీఫ్ పాటర్న్ చిప్ప ప్రభాకర్ ,యోగా సభ్యులు లింగమూర్తి, రాజ్ కుమార్ , రంజిత్, సాయి , శ్రీనాథ్, రమేష్ రెడ్డి, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హస్టల్స్ క్రమబద్ధీకరణ పేరుతో హస్టల్స్ వీలీనం ఆలోచన విరమించుకోవాలి

నవ తెలంగాణ - సిద్దిపేట : రాష్ట్రంలో కెబినేట్ సబ్ కమిటి 50 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న హస్టల్స్ దగ్గరలోని హస్టల్స్ లో వీలీనం చేయడం లేదా పోస్ట్ మెట్రిక్ హస్టల్స్ గా మార్చాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుందని , ఆలోచన విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరవింద, ప్రశాంత్‌లు కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ పేద విద్యార్థులు ప్రధానంగా గ్రామీణ, ఆదివాసీ, దళిత విద్యార్థుల విద్యాభివృద్ధికి పట్టుకోమ్మలుగా హస్టల్స్ ఉన్నాయనీ, విద్యార్థులను దగ్గరలో ఉన్న హైస్కూల్స్ నుంచి హస్టల్స్‌లో చేర్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్నారు. కానీ, హాస్టల్లో విలీనం చేయడం సరికాదన్నారు.

ఘనంగా బీరప్ప పెద్ద పండుగ ఉత్సవాలు

నవతెలంగాణ-మద్దూరు:

మండలంలోని రేబర్తి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప పెద్ద పండుగ ఉత్సవాలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ఆదివారం ఉదయం బియ్యం సుఖించి మధ్యాహ్నం డోలు చప్పులతో ఒగ్గు కళాకారుల విన్యాసాలతో కురుమ కులస్తులు గంగ బోనం తీసుకొని స్థానిక చెరువు వద్దకు వెళ్లారు అనంతరం గంగమ్మకు పూజ చేసి లింగాలను శుద్ధిచేసి బీరప్ప ఆలయంలో లింగాలను చేర్చారు రాత్రి లంద బోనం తీసుకొని ఇండ్లపై సర్వు వేశారు మహిళలు బోనాలను చేసి ఊరేగింపుగా వెళ్లి బీరప్ప కామరాతి మహంకాళి అమ్మ అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించి మొక్కలు చెల్లించారు

ఎస్సీ కమ్యూనిటీ భవనానికి 10 లక్షలు మంజూరు

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

సిద్దిపేట అర్బన్ మండలం ఇన్సాన్ పల్లి గ్రామానికి చెందిన ఎస్సీ కమ్యూనిటీ భవనానికి మంత్రి హరీశ్‌రావు రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు ఆదివారం స్థానిక సర్పంచ్ రవీందర్ గౌడ్, కమ్యూనిటీ సభ్యులు తెలిపారు. పోచమ్మ బోనాలకు ఆహ్వానిస్తూ మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేసిన సందర్భంగా కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేస్తానని పూర్తి నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు కమ్యూనిటీ సభ్యులు తెలిపారు.

పెస్టిసైడ్ ఫస్ట్ లైసెన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులుగా రామచంద్రారెడ్డి

నవతెలంగాణ-కొండపాక

మండల పెస్టిసైడ్ ఫర్టిలాజర్స్ అండ్ సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ను ఆదివారం రోజున ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా డి రాంచంద్రారెడ్డి ఉపాధ్యక్షులుగా కె రాజేష్ కోశాధికారి గా టి సత్యం కార్యదర్శి గా జి రమేష్ ముఖ్య సలహాదారు సి హెచ్.మురళీ మోహన్ డి వెంకటేష్ సలహాదారు కె.నాగప్రసాద్ రవీంధర్ సాయి బాల్ రెడ్డి రవింధరరెడ్డి ఆంజనేయులు వినయ్‌లు ఎన్నికయ్యారు.

పుస్తె మట్టెల అందజేత

నవతెలంగాణ-సిద్దిపేట

నిరుపేద కుటుంబానికి చెందిన లాస్య వివాహం సందర్భంగా దాత మచ్చేందర్ సహకారంతో 25 కేజీల బియ్యం, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పుస్తె మట్టెలు, అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరుణశ్రీ-శ్రీనివాస్ సహకారంతో స్టీల్ సామాన్లు, పూజ సామాగ్రి అందించినట్లు గవర్నర్స్ సోమ వనజ, సోమశివకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డైమండ్లక్లబ్ అధ్యక్షులు మద్దిమల్లేశం, స్నేహ క్లబ్ సభ్యులు చిప్ప మచ్చేందర్, చింత రాజేంద్రప్రసాద్, అర్షపల్లి హరి, తోడుపునురి రమేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మున్సిపాలిటీ లో పెంచిన ఇంటిపన్నులను తగ్గించాలని కోరుతూ నేడు చేర్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా ను జయప్రదం చేయాలని ఆదివారం పట్టణంలోని పెద్దమ్మ గడ్డ,శివాలయం వీధి, బండపల్లి, బీడీ కాలనిలో జేఏసీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాకు పద్మ శాలి పట్టణ సంఘం,మున్నూరు కాపు సంఘం మద్దతు తెలుపుతూ జేఏసీ నాయకులకు తీర్మానం చేసిన కాపీలలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్, నాయకులు ఆముదాల మల్లారెడ్డి,తడ్క లింగం, పుర్మ ఆగంరెడ్డి,కొమ్ము నర్సింగరావు, బండి సుదర్శన్, బుట్టి సత్యనారాయణ,అందె బీరయ్య,బండకింది అరుణ్,బోయిని మల్లేశం,బుట్టి భిక్షపతి, ఎలుగల దుర్గయ్య,బందెల రాంరెడ్డి పాల్గొన్నారు.

గోవా పీసీసీ చీఫ్‌తో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి పూజల గోపి కృష్ణ

నవతెలంగాణ - సిద్దిపేట

గోవా పీసీసీ చీఫ్, హాత్ సే హాత్ జోడో తెలంగాణ ఇంచార్జి గిరీష్ చౌదనకర్‌ను, రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షుడు చమల కిరణ్ కుమార్ రెడ్డిలు సిద్దిపేట కు వచ్చిన సందర్భంగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి పూజల గోపి కృష్ణ, రాష్ట్ర ఫిషర్ మెన్ కార్యదర్శి బాబేస్ లు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.

బీఎస్పీ ప్రధాన కార్యదర్శిగా సాయి తేజ

నవతెలంగాణ -అక్కన్నపేట

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడిగా పని చేసిన తొందురు సాయి తేజను తన పని విధానాన్ని గుర్తించి హుస్నాబాద్ నియోజవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు నియోజకవర్గ అధ్యక్షులు వేల్పుల రాజు, నియోజకవర్గ ఇన్చార్జ్ ఎనగందుల శంకర్ తెలిపారు.

పురుషులు పొదుపు చేసి ఆర్థికంగా ఎదగాలి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

పురుషులు నెలవారి పొదుపులు చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని సర్పంచ్ తోడేటి రమేష్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామంలో స్వకృషి పురుషుల పొదుపు సంఘం 6వ వార్షిక మహా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ పందిల్ల గ్రామ పొదుపు సభ్యులు అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. పొదుపు సంఘం అన్ని విధాల అభివృద్ధి తో ముందుకు వెళ్లేందుకు అందరూ సమిష్టి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఘం అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో 8 న మహిళా సదస్సు

నవ తెలంగాణ - సిద్దిపేట

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ , నేలమ్మ మహిళ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా టిపిటిఎఫ్ ఉపాధ్యాయ భవన్లో 8న మధ్యాహ్నం ఒంటిగంటకు మహిళా సదస్సు నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్షులు సిహెచ్. విజయేందర్ రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ భవన్ లో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర కౌన్సిలర్ యం. వజ్రమ్మ కే .గంగ భవాని ,జిల్లా కార్యదర్శి యం. సుశీల, జిల్లా ఉపాధ్యక్షురాలు కే.వనిత, జిల్లా కౌన్సిలర్ ఎస్. సుకన్య, సంతోషి, రాష్ట్ర సీనియర్ నాయకులు జి. తిరుపతిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నమల రాములు ,జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. మల్లికార్జున్, నాయకులు శివాజీ ,సుధాకర్ రెడ్డి, భగవాన్ రెడ్డి ,రాజు పాల్గొన్నారు.

యువతకు క్రీడా సామాగ్రి అందజేత

నవతెలంగాణ-కొండపాక

కుకునూరు పల్లి మండలం లకుడారం గ్రామానికి చెందిన యువకులకు రైతు బంధు సమితి స్టేట్ కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ ఆదివారం వాలిబాల్ కిట్టు ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా పాల్గొనాలని సూచించారు. క్రీడల్లో ప్రావీణ్యత సాధించి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలన్నారు.

హనుమాన్ చాలీసా యాగంలో పాల్గొన్న నేతలు



నవతెలంగాణ దౌల్తాబాద్

మండలం మాచిన్ పల్లి-సీతారాంపల్లి హనుమాన్ దేవాలయంలో 365 రోజులుగా నిర్వహిస్తున్న హనుమాన్ చాలీసా యాగం చేయడం చాల సంతోషకరమని ఆలయ కమిటీ చైర్మన్ మోటాడు గిరీష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఫ్డిసి చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి ,బ్రైట్వే కమ్యూనికేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మోటాడు సుభాష్ రెడ్డిలు హాజరై దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా యాగంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామ సర్పంచ్ యాదమ్మ, దౌల్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రణం శ్రీనివాస్ గౌడ్ ,వైస్ ఎంపిపి శెకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గుప్త,బుచ్చిరెడ్డి,అంజనీ ప్రసాద్,రాద, అర్చకులు క్రిష్ణమాచార్య, భూపాల్ రెడ్డి భక్తులు పాల్గొన్నారు.